జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 9 పక్షపత్రిక మే 1-15, 2016




## 'అందరికీ ఆరోగ్యం' కోసం లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ఆచరణాత్మక నమూనాపై బహిరంగ చర్చ, ఏకాభిప్రాయ సాధనకు శ్రీకారం


/Political Punches
సంపన్న వర్గాలకు రిజర్వేషన్లు ఎందుకు..?
MP, MLA, IAS, IPS లాంటి ఉన్నతాధికారులకు.. సంపన్న వర్గాలకు
రిజర్వేషన్లు ఎత్తి వేస్తేనే.. పేదలకు రిజర్వేషన్ల ఫలాలు అందుతాయి..!!

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక    మే 1-15, 2016

సంపుటి - 7    సంచిక - 9


## లోపలి పేజీల్లో...


అందరికీ ఆరోగ్యం కోసం లోక్‌సత్తా ............ 5

ప్రపంచ దేశాల్లోనే అత్యంత అధ్వాన్నంగా........ 8

ప్రభుత్వ వైద్యం దూరం... ప్రయివేటు భారం...... 14

ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణంపై .............. 17

కొత్త రాజకీయ శక్తులకు అవకాశం ............. 20

కార్మికులను సంఘటితం చేసిన లోఖాండే...... 21

శతాబ్దాల మడ్డిని కడిగిపారేసిన.................. 23

లోక్‌సత్తా పోరాటం ఐపీఎల్ మీద కాదు........ 24

నీటి కరవూ నేటి క్రికెట్టూ......................... 25

నీటిచుక్కే గగనమైనా పట్టదా...................... 27

డబ్బు, నేర రాజకీయాలపై చర్నాకోలా!........... 29

2015లో తగ్గిన ఉద్యోగాలు....................... 32

రాష్ట్ర సంక్షోభంలో కేంద్రం జోక్యాన్ని తప్పు...... 33

నాణ్యమైన విద్య, ఆరోగ్యం ప్రతి బిడ్డకూ........... 34



## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా వికేంద్రీకరణ, ఉద్యోగాలే పరిష్కారం



కొన్ని చారిత్రక, భౌగోళిక పరిస్థితులు, సైన్యం ప్రమేయం వంటి కారణాల వల్ల కాశ్మీర్‌ను ప్రత్యేకించి చూడాల్సివస్తోందిగానీ, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ భారతదేశ సమస్యల్లో పెద్దతేడా ఏమీ లేదు. సువిశాల భిన్నత్వం మధ్య కేంద్రీకృత దుష్పరిపాలనతో ఈదేశం సతమతమవుతోంది. అవకాశాలకు, వైఫల్యాలకు మధ్య ఊగిసలాడుతోంది. దేశవ్యాప్తంగా ఉద్యోగాలు తగ్గుతూ ఆదాయాల మధ్య అంతరాలు తీవ్రతరమవుతున్నాయి. ఏదో ఎన్నికలు జరుగుతున్నాయ్, ఆటగాళ్లు మారుతున్నారు, ప్రజాస్వామ్యం నడుస్తున్నట్టు కనిపిస్తోందిగానీ.. స్థానికంగా తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, అంటువ్యాధుల నిరోధం వంటి కనీస సౌకర్యాలు కూడా కొరవడి రోజువారీ జనజీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నపని కావాలన్నా లంచం, సిఫార్సు లేకుంటే తలప్రాణం తోకకొస్తోంది. జనాభాలో డెబ్బై శాతం దాకా ఉన్న యువతలో సగంమందికి పైగా ఆధునిక ఆర్థికవ్యవస్థలో ఉపాధి దొరకటం లేదు. నైపుణ్యాలు లేని విద్యావ్యవస్థ ఒక సమస్యయితే, ఉపాధి అవకాశాలను సృష్టించటంలోనూ ప్రభుత్వాల అసమర్థత మరో పెద్దసమస్యగా ఉంది. యువతలో పెరిగిపోతున్న ఈ అశాంతికి నిదర్శనాలే ఎక్కడబడితే అక్కడ తరచూ చెలరేగుతున్న రిజర్వేషన్ అనుకూల, వ్యతిరేక ఆందోళనలు, అస్తిత్వ ఉద్యమాలు. భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్థికరంగంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నా ఆ స్థాయి సరిపోదని ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. పాలన సరిగా ఉంటే.. యువతకు ఉద్యోగాలు ఎక్కడ? పరిశ్రమలను స్థాపించే పెట్టుబడులు ఏవీ? ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అవసరమవుతుంటే, అధికారిక గణాంకాల ప్రకారమే ఏడెనిమిది కీలక ఆర్థిక రంగాలలో గత ఏడాది ఉద్యోగాలు రికార్డుస్థాయిలో ఎందుకు తగ్గాయి?.. కాబట్టి ఖచ్చితంగా మేలుకొలుపు కావాలి, పనితీరు మారాలి. ఉద్యోగాలు కావచ్చు, సబ్సిడీలు కావచ్చు శాస్త్రీయ గణాంకాలను సేకరించి రహస్యాలు లేకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచటాన్ని ప్రభుత్వం ఓ సంస్కృతిగా అమలుచేయాలి. అలాగే ప్రధానమంత్రి ప్రపంచమంతా తిరగనక్కర్లా, రోజుకు నాలుగు గంటలే పడుకుని పనిచేయనక్కర్లా. అవసరమైన చోటికి అవసరమైనప్పుడు మాత్రమే వెళ్తూ రోజుకు ఎనిమిది గంటలూ నిద్రపోతూ ఆరోగ్యంగానే ఉత్సాహంగానే సరైన సంస్కరణలను అమలు చేయటం మీద దృష్టి పెడితే చాలు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పుడు మనకున్న బలాల్ని సద్వినియోగం చేసే వినూత్న కార్యాచరణను ప్రధాని ఆలస్యం చేయకుండా అమలుచేయాలి. నైపుణ్యాలు పెంచేలా విద్యను బాగుచేయటం, నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించటం, ఉపాధి అవకాశాల్ని సృష్టించటం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా చేయటం, గ్రామాలకు -పట్టణాలకు అంతరాన్ని తగ్గించటం కోసం తగిన చర్యల్ని చేపట్టాలి. ఇందుకోసం రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తినిచ్చి స్థానిక ప్రభుత్వాలను పటిష్టం చేయాలి. ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయాలి. కాశ్మీర్‌లో ఇప్పుడు నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల్ని కొలిక్కి తేవటానికి అదనంగా ఇంకొన్ని చేయాల్సి రావచ్చు. కానీ మౌలికంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఈ మార్పుల్ని తీసుకొస్తేనే నిజమైన పరిష్కారం సాధ్యమవుతుంది. ఉత్తరాఖండ్‌లో, ఈశాన్య, తెలుగు రాష్ట్రాలలో ఫిరాయింపుల నిర్వాకం నేర్పే పాఠం కూడా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక ఉండాలన్నదే. రాజ్యసభలో తగిన ప్రాతినిధ్యం లేదు కాబట్టి బీజేపీని రాష్ట్రాల్లో గెలిపించే కార్యక్రమాన్ని చేపట్టామనే సాకులు చెప్పకుండా.. రాజ్యసభకు ఆర్థికాధికారాలు లేకుండా తగిన సవరణలు చేసి కీలకబిల్లుల్ని వేగంగా ఆమోదింపచేసేందుకు ప్రధాని చర్యలు తీసుకోవాలి. అప్పుడు ఆయన పార్టీ దానంతటదే బలోపేతమవుతుంది. పెట్టుబడుల కోసం కృషి చేస్తూనే దేశ ప్రజల శక్తిసామర్థ్యాలను పెంచి సద్వినియోగం చేసుకునేందుకు సమగ్ర సంస్కరణల్ని వేగంగా అమలుచేస్తేనే ప్రజలు తనకిచ్చిన తీర్పుని మోదీ సక్రమంగా అర్థం చేసుకున్నవారవుతారు, తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చినవారవుతారు.






# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.




# 'అందరికీ ఆరోగ్యం' కోసం లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వినూత్న, ఆచరణాత్మక నమూనాపై బహిరంగ చర్చ, ఏకాభిప్రాయ సాధనకు శ్రీకారం

**ఆరోగ్య సేవలు సక్రమంగా అందక తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నా దీనికి పరిష్కారం లేదనే నిరాశానిస్పృహలో కూరుకుపోయి అప్పులను, ప్రభుత్వం అప్పుడప్పుడూ ప్రకటించే చిన్నచిన్న స్కీములను ఆశ్రయిస్తున్న ప్రజలకు అవగాహనారాహిత్యాన్ని, నిస్సహాయతను ఆసరాగా తీసుకుని ప్రభుత్వాలు ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోవటం లేదని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వాలను ఒప్పించేందుకు బహిరంగ చర్చతో తమ కార్యాచరణను ప్రారంభించామని జేపీ తెలిపారు. ఈ చర్చల్లో వచ్చే హేతుబద్ధ, సృజనాత్మకమయిన పరిష్కారాలను కూడా పరిగణలోకి తీసుకుంటూ అందరికీ ఆరోగ్యం నమూనాను మరింత పరిపుష్టం చేస్తామన్నారు.**

ఢిల్లీ నుంచి గ్రామం వరకు జేబులో నుంచి రూపాయి ఖర్చులేకుండా 'అందరికీ ఆరోగ్యం' అందించటం కోసం రూపొందించిన వినూత్న మయిన, సృజనాత్మకమయిన, పటిష్టమయిన నమూనా అమలు కోసం బృహత్ ప్రయత్నాన్ని లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్ (ఎఫ్‌డీఆర్), పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీహెచ్‌ఎఫ్‌ఐ)తోపాటు పౌరసమాజ సంస్థలతో కలిసి ప్రారంభించాయి. తొలిదశగా బహిరంగచర్చను ఏప్రిల్ 23, 2016న న్యూఢిల్లీలో రౌండ్‌టేబుల్‌తో మొదలుపెట్టాయి. ఏకాభిప్రాయ సాధనకు ఏప్రిల్ 25న ఆహ్వానం మేరకు నీతి ఆయోగ్ ముందు ప్రజెంటేషన్‌తో శ్రీకారం చుట్టారు.

ఈదేశంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం దేశాభివృద్ధికి కీలకమని, దేశానికి స్వతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లవుతున్నా ఇప్పటికీ సరైన ఆరోగ్యం అందించే వ్యవస్థ లేకపోవటం వల్ల అప్రజాస్వామికం, అనాగకరికం, పేదరికాన్ని కొనసాగించటమేనని ఈ కార్యక్రమాలకు సారథ్యం వహించిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పీహెచ్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు డా॥ కె.శ్రీనాథ్ రెడ్డితో కలిసి ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. ఇప్పటికైనా మన ఎన్నికల చర్చను, పాలనను నాణ్యమైన ఆరోగ్యం వైపు మళ్లించాలని, అనారోగ్యం ఖర్మ



అనుకోకుండా, ఎవరో దానం చేసినట్టు సహాయపడతారని ఎదురుచూడకుండా మనకున్న పరిమిత వనరుల్లో కూడా అందరికీ ఆరోగ్యం ఎలా అందించవచ్చో ప్రజల్లో అవగాహన పెంచటం, వారి మద్దతును సమీకరించటం ఈ ఆరోగ్య పథకం అమలుకు కీలకమన్నారు.

ప్రపంచ దేశాల్లో ధనిక, సామాన్య దేశాలకంటే కూడా మనం ఆరోగ్యరంగంలో వెనకబడి ఉన్నామని, పాఠశాల చదువులో 74 దేశాల మధ్య మనం 73వ స్థానంలో ఉంటే మనకంటే వెనక చిట్టచివరి స్థానంలో ఉన్న కిర్గిజిస్థాన్ అనే దేశం కూడా వైద్యం, ఆరోగ్యంలో మనకంటే మెరుగ్గా ఉందని జేపీ అన్నారు. అందరికీ ఆరోగ్యం అందించటం ప్రభుత్వ బాధ్యతని, అయితే ఆరోగ్యరంగానికి అత్యంత బాధ్యతారహితంగా కేవలం 1.1 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఏడవ పే కమిషన్ సిఫార్సుల పేరుతో ఉద్యోగులకు జీతాలు భారీగా పెంచిన ప్రభుత్వాలు అందరికీ ఆరోగ్యం అందించటానికి కొద్దిపాటి

నిధులు ఖర్చుచేయటానికి కూడా నిధుల కొరత అంటూ కుంటిసాకులు చూపుతోందన్నారు. అనారోగ్యం వల్ల చేస్తున్న ఖర్చుతో ఏటా దాదాపు 5-6కోట్ల మంది పేదరికంలో కూరుకుపోతున్నారని, పనిచేసే శక్తిని కోల్పోతూ ఈదేశం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు పేదరికాన్ని పోగొట్టలేకపోవటానికి ప్రభుత్వ ఆరోగ్య విధానం, కేటాయింపులు అధ్వాన్నంగా ఉండటం కూడా ప్రధాన కారణంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే భారతదేశానికున్న పరిమిత బడ్జెట్‌లోనే లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యాన్నిచ్చే విధానాన్ని రూపొందించిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరోగ్య రంగానికి నిధుల్ని జాతీయ ఆదాయంలో 2.5శాతానికి పెంచుతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పగా, 2.3 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ఎన్నికల హామీల్లో పేర్కొన్నాయని, లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన నమూనాలో ఇప్పుడు ఖర్చు చేస్తున్న 1.1శాతానికి మరో 0.5శాతం కలిపి పెంచితే అందరికీ ఆరోగ్యం అందుతుందని వివరించారు. మనదేశంలో ఉన్న వైద్యసిబ్బంది నైపుణ్యాలు, చౌకగా మందుల తయారీ, సాంకేతికత, ప్రజల్లో డిమాండ్ వంటి సానుకూల అంశాలను ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఈ విధానాన్ని రూపొందించినట్టు జేపీ చెప్పారు.

ఆరోగ్య సేవలు సక్రమంగా అందక తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నా దీనికి పరిష్కారం లేదనే నిరాశానిస్పృహలో కూరుకుపోయి అప్పులను, ప్రభుత్వం అప్పుడప్పుడూ ప్రకటించే చిన్నచిన్న స్కీములను ఆశ్రయిస్తున్న ప్రజలకు అవగాహనారాహిత్యాన్ని, నిస్సహాయతను ఆసరాగా తీసుకుని ప్రభుత్వాలు ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోవటం లేదని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వాలను ఒప్పించేందుకు బహిరంగ చర్చతో తమ కార్యాచరణను ప్రారంభించామని జేపీ తెలిపారు. ఈ చర్చల్లో వచ్చే హేతుబద్ధ, సృజనాత్మకమయిన పరిష్కారాలను కూడా పరిగణలోకి తీసుకుంటూ అందరికీ ఆరోగ్యం నమూనాను మరింత పరిపుష్టం చేస్తామన్నారు.

భారత ఆరోగ్యరంగానికున్న సంక్షోభానికి మూలం వ్యాధుల చికిత్సకన్నా నివారణకు కీలకమైన ప్రాథమిక ఆరోగ్య దశలో వైఫల్యమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. గ్రామాలలో వైద్యసేవలు అందకపోవటం, ఏ జబ్బుచేసినా జిల్లా స్థాయి ఆసుపత్రులకు, బోధనాసుపత్రులకు రావాల్సిఉండటంతో



ప్రయివేటు, కార్పొరేటు దోపిడీకి ప్రజలు బలవుతున్నారన్నారు.

లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన విధానంలో ఈ ప్రాథమిక వైద్యరంగంలో పూర్తిగా స్వేచ్ఛా మార్కెట్ పోటీ ఉంటుంది. ఎంతమంచి సేవలు అందించి ఎంతమంది ప్రజలను ఆకట్టుకుంటే ఆ వైద్యునికి అంత ఎక్కువ ఆదాయం లభిస్తుందని జేపీ వివరించారు.

**లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ 'అందరికీ ఆరోగ్యం' నమూనా**

**ప్రాథమిక స్థాయిలో జీతాల విధానం బదులు పోటీపడి సంపాదించుకునే ఫ్యామిలీ ఫిజీషియన్ల విధానం:** గ్రామస్థాయి నుంచి ప్రతి కుటుంబానికి కొంతమంది ఫిజీషియన్లు అందుబాటులో ఉంటారు. వీరికి జీతాలిచ్చే వ్యవస్థ లేకుండా, సేవలతో పోటీపడి సంపాదించుకునే విధానం ఉంటుంది. వీరు ఎంబీబీఎస్ చదివి ఫ్యామిలీ ఫిజీషియన్లుగా శిక్షణ పొందినవారై ఉంటారు. ఈ వైద్యులు తాము ఎంపికచేసుకున్న గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలు తమ వైద్యసేవలు తీసుకునేట్టుగా రిజిస్టర్ చేసుకుంటారు. రిజిస్టర్ అయిన ఒక్కో వ్యక్తికీ వైద్యసేవల కోసం ప్రభుత్వం ఏటా రూ.600 వైద్యునికి చెల్లిస్తుంది. ఎంత ఎక్కువమంది ప్రజలను వైద్యుడు/వైద్యురాలు నమోదుచేసుకుంటే అంత ఎక్కువ ఆదాయం వారికి వస్తుంది. ఇలా ఓ మెరుగైన వైద్యునికి ఏడాదికి రూ.30లక్షలకు పైగా కనీస ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. గ్రామాలలో సేవలందించటానికి వారు గ్రామంలో నివాసముండాల్సిన నిబంధన ఉండదు. అందుబాటులో ఉండేలా సమీప పట్టణంలో ఉండవచ్చు. పట్టణాల్లో, నగరాల్లో విపరీత పోటీని ఎదుర్కొంటున్న వైద్యులకు ఇది సువర్ణావకాశమే అవుతుంది. ఇక్కడ జెనెరిక్ మందుల్ని ఉచితంగా అందిస్తారు, టీకాలు వంటి కార్యక్రమాల్ని చేస్తారు. ప్రభుత్వం జీతాలిచ్చే ప్రస్తుత వ్యవస్థకు ఇది విప్లవాత్మకమయిన ప్రత్యామ్నాయం.

**రెండోదశలో తాలూకా స్థాయిలో ప్రభుత్వ కమ్యూనిటీ**

**సెంటర్లు-ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య పోటీ:** రెండోదశ వ్యాధుల చికిత్సలో తాలూకా స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, ప్రయివేటు నర్సింగ్ హోంలకు మధ్య పోటీ ఉంటుంది. ప్రసూతి కేసుల దగ్గర్నుంచి ఎవరు మెరుగైన చికిత్సనందిస్తే, సేవలనందిస్తే వారికి ఆకర్షణీయ చెల్లింపులు ఉండేలా ఈ దశలో ఏర్పాటు ఉంటుంది. ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డుల్ని నమోదు చేసి మొత్తం దేశ ఆరోగ్యరికార్డుని తయారుచేస్తారు. ఇప్పటివరకూ ప్రభుత్వం కేవలం కొన్ని రకాల జబ్బులకు మాత్రమే పీపీపీ నమూనాలో ప్రయివేటు వైద్యులకు చెల్లిస్తోంది. లోక్‌సత్తా నమూనాలో ఏ జబ్బుకైనా మెరుగైన ఆసుపత్రిని ఎంపికచేసుకునే అవకాశం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

**తృతీయ దశలో జిల్లాస్థాయిలో ఎయిమ్స్‌లాంటి ప్రభుత్వ వైద్యసంస్థలు:** వ్యాధి తృతీయదశలో జిల్లా స్థాయి వైద్య సంస్థలుంటాయి. ఈ దశ చికిత్సలో ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ ఉంటుంది కాబట్టి ఇక్కడ కార్పొరేట్ భాగస్వామ్యానికి అవకాశం లేకుండా ఈ నమూనాలో ఏర్పాట్లు ఉంటాయి. ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) వంటి సంస్థలను, తక్కువ ఖర్చుతో మెరుగైన సేవల్ని అందించే శంకర నేత్రాలయ, నారాయణ హృదయాలయ వంటివాటిని మాత్రమే ప్రోత్సహిస్తారు. ఇప్పుడు జరుగుతున్నట్టు ప్రభుత్వం నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు వేలకోట్లు పంచిపెట్టటం ఉండదు.

గ్రామాల్లో కుటుంబ వైద్యుల ప్రాక్టీస్‌కు అనుమతి నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాంతీయ ఆరోగ్య ట్రస్టు ఉంటుంది. వైద్యసేవలను పర్యవేక్షించేందుకు జిల్లా బోర్డులు, తప్పు జరిగితే విచారణకు అంబుడ్స్‌మన్‌లు ఉంటాయి.

ఈ అందరికీ ఆరోగ్యం నమూనాను అమలు చేస్తే వచ్చే 2022నాటికి ప్రాథమిక, నివారించదగ్గ వైద్యసేవలకు రూ.1,20,000 కోట్లు, రెండోదశ సేవలకు రూ.40,000 కోట్లు, తృతీయదశ సేవలకు రూ.93,000కోట్లు ఖర్చవుతాయని జేపీ తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కూడా అంచనావేసి లెక్కిస్తే మొత్తం రానున్న ఏడేళ్లలో రూ.3.5 -3.8 లక్షల కోట్లు ఖర్చవుతాయని, ఇది జీడీపీలో కేవలం 1.67శాతం మాత్రమే ఉంటుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీ కంటే కూడా తక్కువ ఖర్చుచేస్తే చాలని అన్నారు.

లోక్‌సత్తా ఆరోగ్య నమూనాను సరిగ్గా అమలు చేస్తే అతి



తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యం అందటంతోపాటు పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగాలు లభిస్తాయి.

అందరికీ ఆరోగ్యం ఇవ్వాలని 12వ పంచవర్ష ప్రణాళికలో (2012-17) హామీ ఇచ్చినా ఒక నమూనాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయానికి రాకపోవటం వల్ల ఇప్పటికీ ఆ కీలక సంక్షోభం అలాగే కొనసాగుతూ ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది మరణిస్తున్నారని, 97 లక్షలమంది మలేరియా బారిన పడుతున్నారని, 25లక్షల మందికి టీబీ సోకుతోందని, ఆసుపత్రుల పాలయినవారు సగటున ఒక్కొక్కరూ రూ.40,000 ఖర్చు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో కేవలం 0.5శాతం పెంచితే ఈ దేశానికి అద్భుతాలు జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ఆమాత్రం కూడా బడ్జెట్‌ను పెంచలేమని అంటే, ఇక ప్రభుత్వాలు అక్కర్లేదన్నారు.

తాయిలాలు, రుణమాఫీలు వంటి పథకాలుకాకుండా అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం ఉచితంగా ప్రభుత్వమే అందించే బాధ్యత తీసుకుంటేనే పేదరికం, వివక్ష తొలగిపోయి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు వస్తాయని తొలినుంచీ వాదిస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కొన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించిందని, తాజాగా పూర్తిస్థాయి ఫలితాల కోసం కృషి ప్రారంభించామని జేపీ తెలిపారు. అందరికీ ఆరోగ్యం కోసం ఆచరణాత్మకంగా, వినూత్నంగా లోక్‌సత్తా రూపొందించిన నమూనాపై బహిరంగ చర్చకు, ఏకాభిప్రాయ సాధనకు రౌండ్‌టేబుల్‌తో, నీతి ఆయోగ్ సమావేశంతో శ్రీకారం చుట్టామన్నారు. ఆరోగ్య సంస్కరణలపై చాలా సానుకూల వాతావరణంలో ఈ చర్చలు జరిగాయన్నారు. అందరికీ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాలని, కేంద్ర, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో, పార్టీలతో కూడా కూర్చుని నిర్మాణాత్మక వాదనలతో ఒప్పించి అందరికీ ఆరోగ్యాన్ని సాధించేందుకు దృఢసంకల్పంతో కృషి చేస్తామని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ❑

# ప్రపంచ దేశాల్లోనే అత్యంత అధ్వాన్నంగా భారత వైద్య, ఆరోగ్య రంగం




పనికిమాలిన తాయిలాలు, రుణమాఫీలు వంటి పథకాలు కాకుండా అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం ఉచితంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటేనే పేదరికం, వివక్ష తొలగిపోయి అందరికీ ఎదిగే అవకాశాలు వస్తాయని తొలి నుంచీ వాదిస్తూ అందు కోసం కృషి చేస్తున్న లోక్‌సత్తా అందరికీ అందుబాటులో ఆరోగ్యాన్నిచ్చే పథకం కోసం ఏప్రిల్ 23న ఢిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. లోక్‌సత్తా/ ఎఫ్‌డీఆర్ (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్) నిర్వహించిన ఈ సమావేశంలో పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీహెచ్ఎఫ్ఐ), వైద్యారోగ్య రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తూ విజయాలు సాధించిన వారు పాల్గొన్నారు. నీతి ఆయోగ్ ఆహ్వానం మేరకు వారికి కూడా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అందరికీ ఆరోగ్యాన్ని అందుబాటులోకి తెచ్చే ఈ సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని దేశంలో అమలుచేసేలా ఒప్పించేందుకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధానమంత్రి, ప్రతిపక్షాలు, ఇతర ప్రముఖ నేతలతో కూడా సమావేశమై వివరించనున్నారు.

లోక్‌సత్తా సమగ్ర ప్రజారోగ్య విధానం కోసం ప్రపంచ దేశాల అనుభవాలన్నిటినీ తాజాగా అధ్యయనం చేసి నివేదికను సాక్ష్యాలు, గణాంకాలు, విశ్లేషణలతో సహా రూపొందించారు.

భారత్ కంటే జీడీపీ తలసరి ఆదాయం తక్కువ ఉన్న బంగ్లాదేశ్, నేపాల్, వియత్నాం వంటి దేశాలు కూడా మనదేశంలో కంటే మెరుగైన ఆరోగ్యసేవల్ని అందిస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది. పాఠశాల విద్యాప్రమాణాల్లో 74 దేశాల మధ్య జరిపిన ఓఈసీడీ సర్వేలో మనం 73వ స్థానంలో ఉంటే, మనకంటే అధమంగా చిట్టచివరి స్థానంలో ఉన్న కిర్గిజిస్థాన్ దేశం కూడా వైద్య, ఆరోగ్య రంగంలో మనకంటే మెరుగ్గా ఉంది. ఈ నాలుగు దేశాల్లో శిశుమరణాల శాతం మనదేశంలో కంటే తక్కువ.

జీడీపీలో కేవలం 1.1 శాతాన్ని మాత్రమే భారతదేశం వైద్య,ఆరోగ్య రంగంలో ఖర్చు చేస్తోంది. ఇది ప్రపంచంలోనే చెప్పుకోదగిన దేశాలలో తక్కువ. వైద్య ఖర్చుల కోసం చేసే అప్పుల వల్ల మన దేశంలో ఏటా 5.5 కోట్ల మంది పేదరికంలోకి జారి పోతున్నారు.

కానీ ఈ ఆరోగ్య సంక్షోభాన్ని అధిగమించగల కొన్ని కీలక బలాలు భారత్‌కు ఉండటం ఊరటనిచ్చే అంశం. విధానపరమైన స్పష్టత, రాజకీయ సంకల్పం ఉంటే మనం ఢిల్లీ నుంచి గ్రామస్థాయిలోని చిట్టచివరి పౌరునివరకూ మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చు. అది కూడా జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా. నైపుణ్యమున్న వైద్యసిబ్బంది, తక్కువ ధరలకు మందులు తయారుచేయగలగటం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల నుంచి డిమాండ్ ఉన్న కారణంగా పరిమిత బడ్జెట్‌లోనే అపరిమిత ఆరోగ్య అవసరాలను ఆర్థిక భారం లేకుండా అందించే అవకాశం భారత్‌కు ఉంది. ఈ నేపథ్యం నుంచే లోక్‌సత్తా సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని రూపొందించి అమలు కోసం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు, వారి నుంచి ప్రభుత్వంపై, నేతలపై ఒత్తిడి పెంచేందుకు లోక్‌సత్తా మలిదశ ఉద్యమంలో కూడా నాణ్యమైన ఆరోగ్యాన్ని కీలక ఎజెండా అంశంగా తీసుకుంది.

వైద్యరంగంలో ప్రభుత్వరంగాన్ని దాటేసిన ప్రయివేటు రంగాన్ని కూడా చాకచక్యంగా ప్రజల కోసం వినియోగించుకుంటూ భారత్‌లో సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని రూపొందించించిన లోక్‌సత్తా అందుకోసం అధ్యయనం చేసిన పలుదేశాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన కొన్ని దేశాల పద్ధతుల్ని వివరించే ఛార్టులు/ స్లయిడ్లు ఇవి. ఎఫ్‌డీఆర్ ఇంటెర్న్ వీటిని తెలుగులో లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం అందించారు..

# వివిధ దేశాల ఆరోగ్య సంరక్షణ నమూనాలు

## బెవరిడ్జ్ విధానం

గ్రేట్ బ్రిటన్ ,స్పెయిన్ ,స్కాండినేవియా ,న్యూజిలాండ్ ,హాంగ్ కాంగ్

## బిస్మార్క్ విధానం

జర్మనీ ,ఫ్రాన్స్ ,బెల్జియం, నెదర్లాండ్స్ ,జపాన్,స్విట్జర్లాండ్ ,లాటిన్ అమెరికా

## జాతీయ ఆరోగ్య బీమా

కెనడా ,తైవాన్ మరియు దక్షిణ కొరియా

## ప్రజల జేబులనుండి డబ్బు

ఆఫ్రికా ,భారత దేశం ,చైనా,దక్షిణ అమెరికా

## స్వేచ్ఛా మార్కెట్

అమెరికా సంయుక్త రాష్ట్రాలు

## విస్తృత లక్షణాలు

### బెవరిడ్జ్ విధానం

- ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ నిధులను పన్ను చెల్లింపుల నుండి కేటాయిస్తుంది.
- ఎటువంటి వైద్య బిల్లులు ఉండవు.
- ఇక్కడ వైద్య చికిత్స ఒక ప్రజాసేవ.
- ప్రదాతలు ప్రభుత్వ ఉద్యోగులు కావచ్చు.
- ప్రభుత్వమే ఏకైక చెల్లింపుదారుడిలాగా ఖర్చులను నియంత్రించడం వలన వైద్య సంరక్షణ తక్కువ దరకు లభ్యం అవుతుంది.

### బిస్మార్క్ విధానం

- సాధారణంగా యజమానుల మరియు ఉద్యోగుల జీతాల నుండి ఆరోగ్య బీమా కోసం మినహాయించిన డబ్బును ఇక్కడి ఆరోగ్య బీమా వ్యవస్థ ఉపయోగిస్తుంది .
- సొంత లాభాల కోసం ఆశించకుండా బీమాసంస్థలు ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమాలను చేయించవలసి ఉంటుంది.
- సామాజిక నిధులకు పోటీగా ప్రభుత్వం బీమాను సమకూరుస్తుంది.
- వివిధ రకాల వనరులను అందచేస్తుంది

### జాతీయ ఆరోగ్య బీమా

- ప్రదాతలు ప్రభుత్వేతరం .
- ఇది ప్రతి పౌరుడిచే చెల్లింపబడుతూ ప్రభుత్వంచే నడపబడే పథకం.
- ధరల తగ్గుదల గురించి చర్చించి బదిలీ చేయగల మార్కెట్ సామర్థ్యం కలదు.
- జాతీయ బీమా వ్యవస్థ నెలవారీ వాయిదాల పద్ధతిలో బీమాను సేకరించి వైద్య బిల్లులను చెల్లిస్తుంది.
- ప్రణాళికలు అమెరికన్ శైలి బీమా కంటే పాలనాపరంగా, చవకగా మరియు చాలా సరళంగా ఉంటాయి.

### ప్రజల జేబులనుండి డబ్బు

- చాలావరకు వైద్య సంరక్షణ బిల్లులు రోగిచే చెల్లింపబడతాయి.
- సార్వజనిక ఆరోగ్య భద్రతా నిధులు ఉండవు.
- వైద్య సంరక్షణ కేవలం ధనవంతులకు మాత్రమే లభ్యంపేద ప్రజలు అనారోగ్య బారిన పడడం లేదా మరణించడం జరుగుతుంది.



### స్వేచ్ఛా మార్కెట్

- ప్రజలచే చెల్లింపబడిన బీమా వాయిదాల ద్వారా ఒక భద్రతా వలయాన్ని నిర్వహిస్తుంది.
- ప్రభుత్వేతర రంగాల ద్వారా బీమా సేవలను అందిస్తుంది.

సంయుక్త రాష్ట్రాలు వేర్వేరు జనాభాకు వేర్వేరు ప్రణాళికలతో ఒక విచ్ఛిన్నమైన వ్యవస్థను కలిగి ఉన్నాయి.(అనగా 65 సంవత్సరాలు పైబడినవారికి ప్రభుత్వం వైద్య ప్రయోజనాలను అందజేస్తుంది;సైనికులకు ఉచిత సంరక్షణ ;ఉద్యోగులకు యజమానులనుండి బీమా నిధులు;ఆర్థికంగా భరించగలవారికి ప్రభుత్వేతర వైద్య బీమాలు; మరియు ఎటువంటి బీమా లేని వారికి వైద్య సహాయం అందించబడుతుంది.).

# బ్రిటన్ (యు.కె.)

| NHS | స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం శాతం (2013) | 7.6 | శిశు మరణాల రేటు /బాలింత మృతి ప్రమాణం (2015) | 4/9 | సగటు జీవిత కాలం (2013) | 81 |
|---|---|---|---|---|---|---|

**సామాజిక ఆరోగ్య పరిరక్షణ:**

1. 'ప్రాథమిక సంరక్షణ సేవలు' సాధారణ వైద్యులు,దంత వైద్యులు ,కంటి వైద్యులు,ఔషధ విక్రేతలు,చికిత్స కేంద్రాలు మరియు జాతీయ వైద్య సేవా సంస్థలు( NHS ) వంటిఅనేక రకాల సేవాదారుల (వైద్యుల) ద్వారా పంపిణీ చేయబడతాయి. ఇక్కడ 66351 కంటే ఎక్కువ సాధారణ వైద్యులు ప్రాథమిక సంరక్షణ సేవలను అందిస్తున్నారు.

2. అనేక సేవా సంస్థలు మరియు సామాజిక వైద్య సేవా ధర్మ సంస్థల ద్వారా సామాజిక వైద్య సేవలు అందించబడును.జిల్లా నర్సులు,ఆరోగ్య సందర్శకులు, పాఠశాల సంరక్షణ,గృహ వైద్యం,NHS సేవలు మరియు గృహ ఆధారిత పునరావాసం వంటి సేవలు అందించబడతాయి.

**వ్యాధి తృతీయ దశ సంరక్షణ:**

ఆసుపత్రి సేవా సంస్థలు ద్వితీయ వైద్య సంరక్షణ మరియు నాణ్యమైన సేవలను అందిస్తాయి.ఈ సేవా సంస్థల అధిక కార్యకలాపాలు వైద్య చికిత్సారంభ సమూహాల (CCG ) ద్వారా నిర్వహింపబడతాయి.కొన్ని ప్రత్యేక సేవలు కేంద్ర జాతీయ వైద్య సేవా సంస్థల (NHS ) ద్వారా అందించబడతాయి.

**జవాబుదారీ**

"రీవ్యాలిడేషన్" అనే ప్రక్రియ ద్వారా వైద్యులు తాము సాధనకు సరిపడగలము మరియు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్నాము అని నిరూపించుకోవలసి ఉంటుంది.ఇది వృత్తి క్రమబద్ధీకరణ మరియు రోగికి అందించబడే సేవల యొక్క నాణ్యతకు తోడ్పడుతుంది.

**ప్రోత్సాహకాలు / పనితీరు**

ఉత్తమ వైద్య చికిత్స అవార్డు పథకం,ప్రతిభ ఆధారిత చెల్లింపు పథకం ;NHS మరియు కొన్ని ప్రభుత్వేతర సంస్థలు వివిధ జట్టుల కార్యకలాపాలు మరియు ప్రతిభను అంచనా వేసి అభినందించే పథకం కోసం ప్రయత్నిస్తున్నాయి.

**ఆరోగ్య సమాచారం**



ఆరోగ్య మరియు సామాజిక సంరక్షణ సమాచార కేంద్రం (HSCIC ) ఏప్రిల్ ,2013 లో స్థాపించబడి నిర్వాహక వర్గంగా ,జాతీయ సమాచార సంస్థ ,సమాచార గణాంక వివరాలు, మరియు రోగులకు సమాచార సాంకేతిక వ్యవస్థగా వ్యవహరిస్తూ ,సేవా వినియోగదారులు,విశ్లేషకులు,ఆరోగ్య మరియు సామాజిక సంరక్షణ పరిశోధకులను కలిగి ఉన్నది.



**ఔషధ సరఫరా**

ఔషధాల సరఫరా శాఖ చట్టాల ద్వారా ఔషధాలను మూడు వర్గాలుగా విభజించవచ్చు:

**1. వైద్యుడి ఉత్తరువుతో మాత్రమే మందులు :** సాధారణ వైద్యుడు లేదా అవసరమైన అర్హతలు కల్గిన ఆరోగ్య సంరక్షణ వైద్యులచే జారీ చేయబడిన సూచనల ద్వారా ఔషధాలయంలో మందులు సేకరించవచ్చును .

**2. ఔషధాలయ మందులు :** ఈ మందులు ఔషధాలయాలలో లభ్యం అవుతాయి కానీ వీటిని ఔషధ విక్రేత సంరక్షణలో మాత్రమే సేకరించవలసి ఉంటుంది.

**3.సాధారణ అమ్మకపు మందులు :**

ఎటువంటి పర్యవేక్షణ మరియు సూచనల అవసరం లేకుండానే సాధారణ దుకాణాలు మరియు ఔశాదాలయాల నుండి ఇవి లభ్యమవుతాయి.

**సార్వత్రిక భద్రతా నిధి**

UK యొక్క నలుదిక్కుల్లో NHS అనునది ఒక ప్రభుత్వ నిధుల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ.రోగులకు ఈ విస్తృత సేవలను అందించడంలో నైపుణ్యం కలిగిన వివిధ రకాల ప్రత్యేక సంస్థల ద్వారా NHS నెలకొల్పబడినది.ప్రతి 36 గంటలకు పది లక్షల మందికి పైగా రోగులకు ఈ సంస్థ ద్వారా సేవలు అందించబడుతున్నాయి.అత్యవసర సందర్భాల్లో ప్రాథమిక సంరక్షణ సేవకులు భౌతిక మరియు మానసిక ఆరోగ్య సంప్రదింపులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు.వీరిలో సాధారణ వైద్యులు,దంత వైద్యులు,కంటి వైద్యులు మొదలగువారు కలరు.NHS కు నిధులు ప్రభుత్వ ఖజానా నుండి కేటాయించబడతాయి.చాలా వరకు నిధులు పన్నుల ద్వారా సమకూర్చబడతాయి.

# మెక్సికో

| స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం శాతం (2013) | శిశు మరణాల రేటు/బాలింత మృతి ప్రమాణం (2015) | సగటు జీవిత కాలం (2013) |
|---|---|---|
| 3.2 | 11/38 | 77 |



**ప్రాథమిక రక్షణ :**

మెక్సికో ఆరోగ్య వ్యవస్థ ఉద్యోగ స్థితి మరియు సంబంధిత బీమా సంస్థల ఆధారంగా విభజించబడింది. ప్రతి ఒక్క సంస్థ స్వచ్ఛందంగా ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ సేవా ప్రదాతలను మరియు అవసరమైన మౌలిక సంబంధిత సదుపాయాలను కలిగి ఉంది. అదనంగా, మెక్సికోలోని అనేక ఔషధాలయాలలో వైద్య సిబ్బందిచే తక్కువ ధరకు చికిత్స అందించే ప్రాథమిక వైద్య సేవలు లభ్యమవుతాయి. ఈ చికిత్స కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయబడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో కూడుకున్న మరియు అనుకూలమైన చికిత్సను అందచేస్తున్నాయి.

**వ్యాధి తృతీయ దశ సంరక్షణ:**

ఆసుపత్రులలో మరియు చికిత్సా కేంద్రాలలో సామాజిక భద్రత గ్రహీతలకు అందించే వైద్య సంరక్షణ సేవలలో నాణ్యతలో తేడా ఉంటుంది. ప్రధాన పట్టణ సంస్థలు అద్భుతమైన తృతీయ సంరక్షణ అందిస్తాయి.గ్రామీణ ఆసుపత్రులు పురాతన వైద్య పరికరాలు,అసంపూర్ణమైన వైద్య సిబ్బంది కలిగి ఉంటాయి.

**ఔషధ సరఫరా:**

మెక్సికో లో ని ఔషధాలయాల వద్ద చాలా మందులు లాభం అవుతున్నప్పటికీ, కొన్ని మందులు ఔషధాలయాల నుండి సేకరించాలంటే అవి వైద్యుడు జారీ చేసినవే అయి ఉండాలి.ఒక నిర్దిష్ట ఔషధ పరిమాణానికి ఒక ధరను పేర్కొని,తయారీదారులచే మార్పడానికి వీలుపడే సాధారణ వేలం వేయు పద్ధతులచే ఔషధాలను విక్రయించడం ద్వారా మెక్సికో యొక్క సామాజిక భీమా కార్యక్రమాలు ఔషధాల యొక్క రిటైల్ ధరల పైన లాభం పొందుతున్నాయి.



**సార్వత్రిక భద్రతా నిధి:**

మెక్సికో ప్రభుత్వం ఆరోగ్యాన్ని రాజ్యాంగ హక్కుగా గుర్తించి సార్వత్రిక మౌలిక స్థాయిలో ఆరోగ్య సంరక్షను అందిస్తుంది. ఆరోగ్య భద్రతా నిధిలో భాగంగా "సెగ్యురో పాపులర్" అను ప్రక్రియను పరిచయం చేయడం 2003 లో ఒక ప్రధాన ఘట్టం.ప్రాథమిక సార్వత్రిక ఆరోగ్య లభ్యత ఉన్నప్పటికీ, సుమారు 20% మెక్సికన్లు పరిధిలోకి తేన్కోబడడంలేదు. అలాగే మెక్సికో లోఆరోగ్య సంరక్షణ భద్రతా నిధులు ఉన్నవారికి కూడా ఆరోగ్య సమానత్వం తక్కువగా ఉంది.





**నిధులు :**

మెక్సికో యొక్క ప్రజా ఆరోగ్య రంగం ప్రధానంగా పన్నుల ద్వారా అందే నిధులు, అలాగే సామాజిక భద్రతా సంస్థలు మరియు ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య సంరక్షణ నిధులను కలిగి ఉంది. వీటిలోని ప్రతి ప్రభుత్వేతర రంగం సుమారు 40 శాతం మెక్సికో దేశపు జనాభాకు వర్తిస్తుంది. సామాజిక భద్రతా సంస్థలు ప్రభుత్వేతర ఉద్యోగులు,పదవీ విరమణ పొందిన వారు మరియు వారి కుటుంబ సభ్యులకు వర్తిస్తాయి. సామాజిక భద్రత కోసం అర్హత లేని వారికి "సెగ్యురో పాపులర్" అనబడే ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య బీమాను ఎంపిక చేసుకోను అవకాశం ఉన్నది.

**ఆరోగ్య సమాచారం:**

మెక్సికో నాణ్యత మరియు ఫలితాలను పర్యవేక్షించడానికి సమాచార వ్యవస్థను మరియు రోగుల నమోదు వివరాలను వేరు చేసింది. వైద్య నిపుణులు రోగి యొక్క సమాచారాన్ని ఒక కేంద్రీకృత రికార్డు ద్వారా వెంటనే పొందటానికి వీలుండే విధంగా దీనిని మార్చడం కోసం మెక్సికో ఆరోగ్య సమాచారం సహకార సంస్థ (NMHIC) ఆరోగ్య సమాచార మార్పిడి(HIE) విధానాన్ని అమలు చేయడానికి యోచిస్తున్నది.

**జవాబుదారీ**

నాణ్యతలేని పర్యవేక్షణ మరియు సంస్కరణలు అసమర్థమైన ఆరోగ్యరక్షణ వ్యవస్థకు దారితీసేవిగా ఉన్నాయి.

**ప్రోత్సాహకాలు / పనితీరు**

"సెగ్యురో పాపులర్" తో అనుసంధానం స్వచ్ఛందం అయినప్పటికీ,ప్రోత్సాహకాల ద్వారా సంస్కరణలు భద్రతా పరిమితిని విస్తరింపచేస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయ వ్యయాల ప్రణాళిక వార్షికంగా ఆధారితం అయినందున ప్రభుత్వం పూర్తి ప్రజానీకానికి ప్రోత్సాహకాలను అనుబంధిస్తుంది. ఈ అనుబంధ ప్రక్రియ యొక్క స్వచ్ఛంద ప్రవృత్తి ఒక ఎంపిక చేయబడిన మూలక పరిచయం ద్వారా వార్షిక ప్రణాళికను ప్రజాస్వామికం చేయడానికి సహాయపడే ఒక ముఖ్యమైన లక్షణం. ఇది ప్రతికూల ఎంపికను నిరుత్సాహపరచడం మాత్రమే కాకుండా సార్వత్రిక భద్రతా నిధికి ప్రోత్సాహకాలు,మంచి నాణ్యత మరియు సామర్థ్యాన్ని అందిస్తుంది.

## శ్రీలంక

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం శాతం (2013) | 1.4 | శిశు మరణాల రేటు/బాలింత మృతి ప్రమాణం (2015) | 8/30 | సగటు జీవిత కాలం (2013) | 74 |

**సామాజిక ఆరోగ్య పరిరక్షణ:**

సామాజిక ఆరోగ్య సంరక్షణ సేవలు 80,000 నుండి 100,000 మంది పౌరులకు ఆరోగ్య సిబ్బందుల ద్వారా అందించబడతాయి.ఆరోగ్య సిబ్బందుల కార్యకలాపాలు కింది విధంగా ఉన్నాయి:1)జిల్లాలోని అన్ని ఆరోగ్య సమస్య అంశాలపైన సాధారణ మరియు ప్రత్యేకమైన ఆరోగ్య సర్వేలను నిర్వహించడం.2)వివిధ ప్రాంతాల యొక్క కీలకమైన గణాంకాలను సేకరించడం మరియు పరిశీలించడం3)ఆరోగ్య విద్యా ప్రచారం 4)అంటూ వ్యాధులను నియంత్రించడానికి చర్యలు చేపట్టడం5)తల్లి మరియు బిడ్డ ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం6)పాఠశాల వైద్య కార్యక్రమాలను నిర్వహించడం7)గ్రామీణ మరియు పట్టణ పారిశుధ్య పదకాల అభివృద్ధి.



**వ్యాధి తృతీయ దశ సంరక్షణ:**

స్వస్థత సంరక్షణ బోధనా వైద్యశాలలు,ప్రాంతీయ సాధారణ ఆసుపత్రులు,జిల్లా సాధారణ ఆస్పత్రులు మరియు మూల ఆస్పత్రులు ద్వారా అందించబడుతుంది.ద్వితీయ ఆస్పత్రులు నాలుగు ప్రాథమిక ప్రత్యేకతలు అందిస్తాయి. (వైద్యం, శస్త్రచికిత్స, పీడియాట్రిక్, ప్రసూతి మరియు గైనకాలజీ). ప్రత్యేక శ్రద్ధ అవసరమయిన రోగులకు తృతీయ చికిత్సా కేంద్రాలలో సేవలు లభ్యం కాగా.ప్రథమ చికిత్సా కేంద్రాలలో ఈ సేవలు అందుబాటులో లేవు.

**ఔషధ సరఫరా:**

బహిరంగ టెండర్ పోటీ ప్రక్రియ ద్వారా శ్రీలంక జాతీయ ఔషధీయ పురపాలక సంస్థ (SPC ) ఆరోగ్య మంత్రిత్వశాఖ మరియు ప్రభుత్వేతర రంగ మార్కెట్లకు ఔషధాల ఎగుమతి దిగుమతి చేస్తుంది.SPC సాధారణ ప్రజలకు ఔషధాలను జాలాకార యంత్రాంగం మరియు పంపిణీదారుల ద్వారా అందచేస్తుంది.శ్రీలంకలో రెండు కోట్ల పది లక్షల మంది జనాభాకు 5000 కు పైగా ఔషధాలయాలు ఉన్నాయి.నేడు శ్రీలంక మొత్తం ఔషధ మార్కెట్ సుమారు 365 మిలియన్ల డాలర్లు.దీనిలో ప్రభుత్వేతర రిటైల్ మార్కెట్ అమ్మకాలు 60 శాతం,ప్రభుత్వ ఆస్పత్రిలో కొనుగోళ్లు సుమారు 28 శాతం,ప్రభుత్వేతర ఆస్పత్రులు సుమారు 10 శాతం, కుటుంబ వైద్యులు పంపిణీ సుమారు 2 శాతంగా ఉన్నాయి.

**ప్రోత్సాహకాలు/పనితీరు**

పనితీరు ఆధారితమైన జీవన ప్రగతి అభివృద్ధి,శిక్షణ అవకాశాలు,విశిష్ట సభ్యత్వం వంటి ఆర్థికపరం కాని ప్రోత్సాహకాలు,కేంద్ర, ప్రాదేశిక నిర్వాహకులకు మరియు ఆసుపత్రి నిర్వాహకులకు ఆర్థిక పరమైన ప్రోత్సాహకాలు అందచేయబడుతున్నాయి.

**సార్వత్రిక భద్రతా నిధి:**

శ్రీలంక యొక్క ప్రథమ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ నుండి ఉచితంగా సార్వత్రిక ఆరోగ్య భద్రతా నిధులను అందచేయుటకు ఆధారంగా ద్వీపమంతటా అందుబాటులో ఉంది. దీర్ఘ కాల వ్యాధులకు అధిక వ్యయం మరియు అధిక సంరక్షణ సేవలు,అంటూ వ్యాధులు కాని వ్యాధుల అధిక భారం వలన ఈ వ్యవస్థ ఒత్తిడికి గురి అవ్వుంది.నాణ్యమైన సార్వత్రిక ఆరోగ్య సేవలను అందించడానికి ప్రభుత్వం చేసిన హామీలు అమలులో ఉండగా,కొన్ని మార్పులు చేయుట అవసరమని గుర్తించబడినది. శ్రీలంక లోని ప్రథమ చికిత్సా సంరక్షణ సామాజిక ఆరోగ్య సంరక్షణ మరియు అస్వస్థతా నివారణ సేవలు అను రెండు సమాంతర సేవలుగా విస్తరింపబడింది.

**నిధులు :**

కొన్ని ప్రభుత్వేతర రంగాల భాగస్వామ్యంతో అలాగే పరిమిత దాత ధనంతో ప్రభుత్వమే ప్రధానంగా ఆర్థిక వనరులు అందిస్తుంది.ప్రభుత్వ రంగ నిధులు పన్నుల ద్వారా ఉత్పత్తి అయిన సాధారణ ఖజానా నుండి కేటాయింపబడతాయి.ప్రభుత్వేతర రంగాలు స్వయంగా,ప్రభుత్వేతర బీమాల ద్వారా నిధులు సమకూర్చుకోగా.ప్రభుత్వ రంగ సేవలు ప్రజారోగ్య సంస్థల ద్వారా ప్రతి పౌరునికి పూర్తిగా ఉచిత సేవలను ద్వీపమంతటా విస్తరింపచేసాయి.

**ఆరోగ్య సమాచారం**

ఈ క్రింది వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి:రోగుల పరిపాలన వ్యవస్థ (PAS), ప్రయోగశాల సమాచార నిర్వాహక వ్యవస్థ (LIMS), ఎలెక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్ (EMR), ఎలెక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (EHR) మరియు నిర్వహణ సమాచార వ్యవస్థ (MIS)

**జవాబుదారీ :**

పేద ప్రజలకు ప్రజాస్వామ్య రాజకీయాల ద్వారా సేవలను అందించే ప్రభుత్వానికి శ్రీలంక ఒక ఉదాహరణ(ప్రపంచ బ్యాంకు 2003).చిన్న ఎన్నికల సంఘాలు,జాతీయ రాజకీయాల్లో 5000 వోటర్ల ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలు పోటీ పడుతూ వారి వారి నియోజకవర్గాలలో ఆసుపత్రులను నిర్మించాయి.

## థాయిలాండ్

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం శాతం (2013) | 3.7 | శిశు మరణాల రేటు /బాలింత మృతి ప్రమాణం (2015) | 11/20 | సగటు జీవిత కాలం (2013) | 74 |

**సామాజిక ఆరోగ్య పరిరక్షణ:**

సామాజిక ఆసుపత్రులను జిల్లా స్థాయిలో మరియు పరిమాణం ఆధారంగా వర్గీకరించవచ్చు: భారీ సామాజిక ఆస్పత్రులు 90 నుండి 150 పడకల సామర్థ్యము కలిగి,మాధ్యమ సామాజిక ఆసుపత్రులు 60 పడకల సామర్థ్యము కలిగి, చిన్న ఆసుపత్రులు 10 నుండి 30 కు పడకలు పరిమాణాన్ని కలిగి ఉంటాయి. పై మూడు రకాల ఆసుపత్రులు స్థానిక ప్రజలకు సేవలను అందిస్తాయి.సామాజిక ఆసుపత్రులు ప్రాథమిక సంరక్షణ అందించడానికే పరిమితం కాగా,మరింత ఆధునికమైన మరియు ప్రత్యేకమైన సేవలు అవసరమైన రోగులకు సాధారణ లేదా ప్రాంతీయ ఆసుపత్రులను సూచించడం జరుగుతుంది.



**వ్యాధి తృతీయ దశ సంరక్షణ:**

చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన రోగికి సంరక్షణ భిన్నంగా ఈ మూడు పథకాల ద్వారా అందించబడుతుంది.ప్రజా సేవా వైద్య ప్రయోజన పథకం(CSMBS),సామాజిక భద్రత పథకం(SSS) మరియు సార్వత్రిక భద్రతా నిధి పథకం(UCS).ఆర్థిక ప్రాజ్ఞతను ప్రోత్సహిస్తూ సార్వత్రిక సంరక్షణ అందించడం ముఖ్య ఉద్దేశ్యం.ప్రజా సేవా వైద్య ప్రయోజన పథకం ద్వారా సంరక్షణ అందిస్తున్నప్పుడు ఆ నిధులు అంతర్జాతీయంగా సమకూర్చబడతాయి.అలాగే,ప్రజా సేవా వైద్య ప్రయోజన పథకం,రోగ నిర్ధారణ సంబధిత సమూహం(DRG) యొక్క చెల్లింపుల సంస్థ అనవసరమైన చికిత్సను ప్రోత్సహించదు.

**ఔషద సరఫరా :**

మందులు జాతీయ ఆరోగ్య పరిరక్షణ కార్యాలయం (NHSO) ద్వారా సేకరించబడి పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయబడతాయి.ఈ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం ఒక ప్రభుత్వేతర పంపిణీదారుడితో అలాగే వేర్వేరు ఔషద సరఫరా దారులతో ఒప్పందం చేసుకుంటుంది.ఈ వ్యవస్థ ప్రతి ఒక్క చికిత్సా కేంద్రం తో అనుబంధించబడి ఉంటుంది.మందుల ధరలలో రాయితీలు కూడా సమకూర్చబడతాయి.

**ఆరోగ్య సమాచారం**

ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ ప్రస్తుతం పరిపాలనా మరియు ఆర్థిక నిర్వహణ వ్యవస్థలను క్రమబద్ధించడం ద్వారా ఆరోగ్య ఫలితాలను అంచానా వేయడంలోని ఆటంకాలను మెరుగు పరచడమే లక్ష్యంగా దాని యొక్క ఆరోగ్య సమాచార వ్యవస్థను సంస్కరిస్తుంది.DRG పరిహారం కోసం ఆసుపత్రికి ఎలక్ట్రానిక్ ఉత్సర్గ సారాంశాలు,ఖచ్చితమయిన మరియు లాభదాయకమైన సమాచార మార్గాలు మరియు సమాచార పంపకాల ద్వారా UCS థాయిలాండ్ యొక్క ఆరోగ్య సమాచార వ్యవస్థ అభివృద్ధికి అధికంగా కృషి చేసింది.జాతీయ ఆరోగ్య భద్రతా కార్యాలయం(NHSO) యొక్క వ్యాధి నిర్వహణ వ్యవస్థ మంచి ఫలితాలను సాధించింది.

**నిధులు:**

ప్రధానంగా పన్నుల ద్వారా మరియు ఉద్యోగి మరియు యజమానుల ఇద్దరి సహ సహకారం ద్వారా నిధులు సమకూర్చబడతాయి.

**సార్వత్రిక భద్రతా నిధి:**

ప్రధానంగా ఈ క్రింది మూడు పథకాల ద్వారా ప్రజలకి భద్రతా నిధులు సమకూర్చబడతాయి.అవి CHMBS ,SSS మరియు UCS .

NHSO
National Health Security Office

**జవాబుదారీ :**

లాభ రక్షణ కోసం NHSO ద్వారా వివిధ విధానాలు ఏర్పాటు చేయబడ్డాయి: అవి "1330" నిరాటంక తంత్రీ మార్గము,రోగి ఫిర్యాదుల సేవ,పరిహార నిధి,నాణ్యత మెరుగుపరచడం మరియు పటిష్టమైన ఆసుపత్రి ప్రాతినిధ్య అవసరాలు.

**ప్రోత్సాహకాలు/పనితీరు :**

ప్రభుత్వం కొత్త వైద్య పట్టభద్రులకు ఖచ్చితంగా మూడు సంవత్సరాల ప్రజాసేవను అమలు చేస్తుంది. అలాగే గ్రామీణ వైద్యులకు వివిధ ప్రోత్సాహకాలు ఆపద మరియు ప్రభుత్వ సాధనా భత్యాలు,అలాగే ప్రత్యేక సేవా భత్యాలు అందిస్తుంది.సార్వత్రిక భద్రతా నిధుల పథకం మొదలైన తర్వాత ఈ ప్రోత్సాహక నిధులను 20 శాతం వరకు పెంచడం జరిగింది.పదవి విరమణ చేసిన వైద్యులను నియమించడం కూడా అమలు చేయబడినది.దీర్ఘకాలిక చర్యల కొరకు 2005 నుండి 2014 వరకు అదనంగా 10,678 వైద్య విద్యార్థులను నియమించే ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది.సమాన విద్య,ప్రాంతీయ పరిజ్ఞానం కోసం జిల్లా పరిధిలో మరిన్ని కొత్త వైద్య విద్యార్థులను నియమించి వారికి ప్రాంతీయ ఆసుపత్రులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

# ప్రభుత్వ వైద్యం దూరం.. ప్రయివేటు భారం
# దేశంలో తీవ్రతరమవుతున్న ఆరోగ్య సంక్షోభం

**రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యం (శాతాల్లో)**

| రాష్ట్రం | ప్రైవేటు వైద్యం | | ప్రభుత్వ వైద్యం | |
|---|---|---|---|---|
| | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ |
| ఏపీ | 77.5 | 78.2 | 22.5 | 21.8 |
| తెలంగాణ | 71.4 | 78.8 | 28.6 | 21.2 |
| అస్సాం | 10.8 | 48.5 | 89.2 | 51.5 |
| కర్ణాటక | 73.2 | 81.7 | 26.8 | 18.3 |
| తమిళనాడు | 59.6 | 70.7 | 28.6 | 21.2 |
| కేరళ | 65.3 | 66.7 | 34.7 | 33.3 |
| ఒడిశా | 18.7 | 42.0 | 81.3 | 58.0 |
| జాతీయసగటు | 58.1 | 68 | 41.9 | 32.0 |



మనదేశంలో వైద్యం, ఆరోగ్యం అధ్వాన్నంగా ఉన్నాయని జాతీయ నమూనా సర్వే మరోసారి ధృవీకరించింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయేకాలంలో అగ్రరాజ్యం కావటం మాట అలా ఉంచి, ఆరోగ్యభారంతో కుంగిపోయే దేశంగా మారిపోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి, విద్యకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని తన పరిధిలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని తీసుకుంటే ఫర్వాలేదుగానీ, ఈ రంగాలలో ప్రజల మీద ఉన్నకొద్దీ మితిమీరిన భారాన్ని మోపేలా ఈ మౌలికరంగాలు ప్రయివేటులోకి తరలిపోవటం తీవ్ర విపరిణామాలకు దారితీస్తుంది. దేశానికి బలంగా ఉండే మానవవనరుల్ని బలహీనపరుస్తుంది.

సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పుకుంటోందని, పైకి ఆరోగ్యశ్రీ, బీమా పథకాలు వంటి చిట్కాలతో ప్రజలకు మేలుచేస్తున్నట్టు కనిపిస్తూనే ప్రయివేటు రంగాన్ని పటిష్టం చేస్తోందని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. వైద్యం కోసం ప్రయివేటు వర్గాలు అడిగినంత డబ్బులిచ్చి పేదరికంలో కూరుకుపోవటం, ఆ తర్వాత బైటపడలేక బతుకు వెళ్లదీయటమే ఈదేశంలో అత్యధికులకు మిగిలిన అవకాశమని ఈ అంకెలు హెచ్చరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 70శాతంమందికిపైగా ప్రజలకు ఇప్పుడు జేబులకు చిల్లుపెట్టే ప్రయివేటు వైద్యమే దిక్కుగా మారిందని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) 'భారతదేశ ఆరోగ్యం'పై నిర్వహించిన జాతీయ నమూనా సర్వే-71లో వెల్లడించింది. ప్రభుత్వ దవాఖానాలో సేవలు నాసిరకంగా ఉండటంతో తలకు మించిన భారమైనా ప్రజలు ప్రయివేటు వైపు మొగ్గుచూపుతున్నారని, దీంతో ప్రయివేటు వైద్యవ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోందని సర్వే తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రయివేటు వైద్యం మరింత దూకుడుగా పెరుగుతోందని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో సగానికి సగం మంది వైద్యం కోసం భారీ అప్పులు చేస్తున్నారని, ఆస్తులూ అమ్ముకుంటున్నారని చెప్పింది.

పదేళ్లకోసారి నిర్వహించే ఈ సర్వేలోని అంశాలను లోక్‌సత్తా ఇప్పటికే పలుమార్లు ప్రజలముందుంచి జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఉన్న నిధులతోనే 'అందరికీ ఆరోగ్యం' అందించే విధానాలను రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో అమలుకు కృషి చేస్తున్న విషయం తెలిసిందే. తాజా సర్వే వివరాలు పరిస్థితి తీవ్రతను మరోమారు తెలియపరిచి ఈదేశానికి సరైన ఆరోగ్య విధానాన్ని యుద్ధప్రాతిపదికన అమలుచేయాల్సిన అవసరముందని మనందరినీ హెచ్చరిస్తున్నాయి.

జాతీయ నమూనా సర్వే ప్రకారం, 1995-96లో దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం జాతీయ సగటు 19శాతం ఉండగా 2014నాటికి 28శాతంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతంలో 1995-96లో 22వాతం ఉండగా 2014నాటికి 16శాతానికి పరిమితమైంది. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం పదేళ్లలో 20శాతం నుంచి 12శాతానికి తగ్గింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం 19 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో తొమ్మిది శాతం మాత్రమే ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యసేవల్లో అసోం 89శాతంతో అగ్రస్థానంలో ఉండగా తర్వాత స్థానంలో 81శాతంతో ఒడిషా ఉంది. మూడోస్థానంలో రాజస్థాన్ 44శాతం, తమిళనాడు 42శాతంతో నాలుగోస్థానంలో ఉన్నాయి. ప్రయివేటు వైద్యసేవలు అత్యధికంగా ఉంటూ ప్రభుత్వ వైద్యసేవల పాత్ర నామమాత్రంగా మారుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ముందు స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ఆరోగ్య బీమా నామమాత్రంగానే ఉందని సర్వేలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంతాల్లో 86శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 82శాతం మందికి ఎలాంటి ఆరోగ్య బీమా లేదు. అసంఘటిత రంగంలోనివారికి స్వాస్థ బీమా యోజన, ఈఎస్ఐ, ప్రభుత్వ ఉద్యోగులకు సీజీహెచ్ఎస్, ఇతర ఆరోగ్య బీమా కలిపినా 16శాతం మించి లేకపోవటం గమనార్హం. అంటే సగటున 84శాతం మందికి ఎలాంటి ఆరోగ్య బీమా లేదు.

వైద్యం కోసం చేస్తున్న వ్యయంలో అత్యధికంగా 70శాతం మందుల కోసంకాగా, డాక్టర్ల ఫీజులు, వైద్య పరీక్షలు, ఇతర ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయి. కుటుంబ పోషణ, సాధారణ ఆర్థిక వ్యవహారాల్లో తలమునకలై ఎక్కువమంది తమ ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారు.

వైద్య ఖర్చుల కోసం సంపాదన, పొదుపు చేసిన మొత్తం నుంచి ఎక్కువ వ్యయం చేస్తుండగా, అప్పులు చేసి 25శాతం మంది వైద్యం పొందుతున్నారు. వీరిలో కొందరు విధిలేక ఆస్తులు అమ్ముకుంటున్నారు. వృద్ధాప్యంలో 81శాతం మంది వృద్ధులకు పిల్లల సంపాదనే ఆధారంగా ఉంది.

దక్షిణాది రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాలలో సగం, అంతకంటే ఎక్కువ కాన్పులు ప్రయివేటు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయి.




కాన్పుల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో సగటున ఒక కాన్పుకు ఆసుపత్రి వ్యయం రూ.5544 అవుతుండగా, పట్టణ ప్రాంతాలలో ఇది రెట్టింపునకు పైగా రూ.11685 అవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరితే అయ్యే వ్యయం కంటే సుమారు తొమ్మిది రెట్లకు పైగా ప్రయివేటు ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఏపీలో గ్రామీణ ప్రాంతాలలో అయ్యే వైద్యఖర్చు కంటే పట్టణ ప్రాంతాలలో రెట్టింపునకు పైగా వ్యయమవుతుండగా, తెలంగాణలో కాస్త అటూఇటుగా ఉంది. తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో వైద్య ఖర్చు రూ.21683కాగా, పట్టణాల్లో రూ.22584 ఖర్చవుతోంది. అదే ఏపీలో ఆ వ్యయం రూ.15411, రూ.33671గా ఉంది.

**జబ్బులొస్తే అప్పులపాలే**

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వైద్యం కోసం సగం మంది అప్పులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి వెయ్యిమందిలో 505 మంది అప్పుల ద్వారా వైద్యానికి కావలసిన డబ్బుని సమకూర్చుకుంటున్నారు. వీరిలో బంధుమిత్రుల నుంచి 40మంది అప్పులు తీసుకుంటుండగా, 5గురు ఆస్తులు అమ్ముకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్పులు చేసేవారి సంఖ్య వెయ్యికి 236గా ఉంది. వీరిలో బంధుమిత్రుల నుంచి అప్పులు తీసుకుంటున్నవారు 33మందికాగా, ఆస్తులు అమ్ముకుంటున్నవారు 4గురు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతంలో ప్రతి వెయ్యిమందిలో 520మంది అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారు. వీరిలో బంధుమిత్రుల నుంచి అప్పులు చేస్తున్నవారు 23మందికాగా, ఆస్తులు అమ్ముకుంటున్నవారు 25మంది ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్పులు చేస్తున్నవారు 347 మందికాగా, బంధుమిత్రుల నుంచి ఆర్థికసాయం తీసుకుంటున్నవారు 39 మంది ఉన్నారు. ఏడుగురు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకుంటున్నారు.

### అస్వస్థతకు గురవుతున్నవారు

అస్వస్థతకు గురవుతున్నవారు ప్రతి వెయ్యిమందిలో ఏపీ గ్రామీణ ప్రాంతాల్లో 155మంది, తెలంగాణలో 67మంది ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 204, 95గా ఉంది. రెండు రాష్ట్రాల్లోనూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళలు పురుషుల కంటే ఎక్కువ అస్వస్థతకు గురవుతున్నారు.

### అంటువ్యాధులే అధికం

తెలుగు రాష్ట్రాల్లో జ్వరాలు, అంటువ్యాధులు (21శాతం), గుండెజబ్బులు (13), జీర్ణకోశవ్యాధులు (12), గాయాల (16శాతం) వల్లే ఎక్కువమంది ఆసుపత్రుల పాలవుతున్నారు. మహిళలకు క్యాన్సర్ శాపంగా మారింది. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా దీనిబారిన పడుతున్నారు. గుండె సంబంధ వ్యాధులూ వారికే ఎక్కువని జాతీయ ఆరోగ్య సర్వేలో తేలింది. మానసిక, నరాల వ్యాధుల్లో పురుషులే ఎక్కువమంది బాధితులుగా ఉంటున్నారు. గాయాలతో ఎక్కువగా ఆసుపత్రుల్లో చేరుతున్నదీ వారే. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకంటే పురుషులు నాలుగు రెట్లు ఎక్కువగా గాయాలబారిన పడుతున్నారు. గ్రామీణ మహిళలు పట్టణ మహిళలకంటే ఎక్కువగా క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

### సర్వేలోని మరికొన్ని అంశాలు..

- ఇరవై ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వెళ్తున్నవారి సంఖ్య వెయ్యికి 13 ఉండగా, తాజాగా అది 35కు పెరిగింది. పట్టణాల్లో 20 నుంచి 44కు పెరిగింది.
- జ్వరం సహా పలురకాల ఇన్ఫెక్షన్ల కారణంగా పట్టణ, గ్రామాల్లో 25శాతం మంది ఆసుపత్రులకు వెళ్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులకు గ్రామాల్లో 8, పట్టణాల్లో 11 మంది చికిత్స చేయించుకుంటున్నారు.
- అనారోగ్యం పాలవుతున్నవారిలో ఎక్కువమంది 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, చిన్న పిల్లలు
- ప్రయివేటు వైద్యంపై గ్రామాల్లో 72శాతం, పట్టణ ప్రాంతాల్లో 79శాతం ఆధారపడుతున్నారు
- గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందడానికి.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అయితే రూ. 5636, ప్రయివేటు ఆసుపత్రుల్లో అయితే రూ. 21726 ఖర్చు చేస్తున్నారు
- ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునానీ, సిద్ధ వైద్యం తీసుకుంటున్నవారు ఐదు నుంచి ఏడుశాతం.

జాతీయ నమూనా సర్వేని చూస్తే గతంలో కంటే వైద్యారోగ్య రంగం గణనీయ ప్రగతిని సాధించినా, సేవలు విస్తరించినా, జబ్బులు పెరుగుతూ ప్రజలపై వ్యక్తిగత ఆర్థిక భారం విపరీతమవుతోందని స్పష్టమవుతోంది. అనారోగ్యం వ్యక్తులతోపాటు దేశాభివృద్ధిని కూడా తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ పరిణామం ముమ్ముందు దేశానికి పెద్దసవాలు అవుతుందని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే హెచ్చరించింది. దేశ ఆరోగ్యరంగాన్ని బాగుచేసేందుకు ఏళ్ల తరబడి కృషి చేస్తున్న లోక్‌సత్తా ఇప్పటికే జాతీయ ఆరోగ్య మిషన్‌ను రూపొందించినా అది ఇంకా అరకొరగానే అమలవుతోంది. యూపీయే కంటే ఆరోగ్యరంగానికి ఎక్కువ కేటాయింపులు చేస్తామని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా ఇంకా అమలు కాలేదు. దేశంలో ఆరోగ్య సంక్షోభం పెరిగిపోతున్న నేపథ్యంలో, లోక్‌సత్తా మళ్లీ చొరవ తీసుకుని అందుబాటులో ఉన్న నిధులతోనే (జీడీపీలో 2శాతం లోపు) ప్రజల మీద భారం లేకుండా అందరికీ అన్ని రకాల జబ్బులకీ వైద్యంతో ఆరోగ్యం అందించే ఆచరణాత్మక విధానాన్ని రూపొందించింది. ఇందుకోసం దేశంలో అత్యున్నత వైద్యనిపుణులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాలు వంటివి నిర్వహించింది. నీతి ఆయోగ్ ఆహ్వానం మేరకు అక్కడ కూడా అందరికీ ఆరోగ్యం పథకాన్ని ప్రజెంటేషన్ ఇచ్చింది. అందరికీ ప్రభుత్వ వైద్యం అందించాలంటే ఉన్న మౌలిక వసతులు చాలవు కాబట్టి, ప్రభుత్వమే ప్రయివేటు వైద్యం ఖర్చు వ్యయాన్ని కూడా భరించేలా ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో లోక్‌సత్తా ఈ వైద్యారోగ్య పథకాన్ని రూపొందించింది. వచ్చే కొన్ని నెలల్లో ఈ ఆరోగ్య పథకం అమలై 'ఆరోగ్య భారత్' రూపుదిద్దుకుంటుందని ఆశిద్దాం. ❐

# ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణంపై అలవిమాలిన అశ్రద్ధ

- డా॥ జయప్రకాష్ నారాయణ్

అభివృద్ధికి ప్రధాన సంకేతం మనిషి ఆరోగ్యం. ఒకనాడు అన్ని సమాజాలలోను ఓ వ్యక్తి 30 ఏళ్లు బతికితే చాలాకాలం జీవించినట్టు లెక్క! నూటికి 50మంది పసితనంలోనే చనిపోయేవాళ్లు. గర్భిణులకు కాన్పంటే పునర్జన్మలా ఉండేది. చాలామంది ప్రాణాలు పోయేవి. ఏ జబ్బు చేసినా దానికి చికిత్స లేదు. తీసుకునే ఆహారంలో ఏ పదార్థాలుండాలో, వేటి కొరత వల్ల ఏ జబ్బులు వస్తాయో తెలియదు. 'సి' విటమిన్ గురించి అవగాహన లేని కారణంగా ఓడలలో సముద్రయానం చేసే పాశ్చాత్యులు లెక్కకు మిక్కిలిగా మరణించేవారు. ఇక మశూచికం, ప్లేగు లాంటి మహమ్మారులు సోకితే కొద్దిరోజులలో లక్షలమంది బలయ్యేవారు. ఎన్నో పట్టణాలను ఈ వ్యాధులు నిర్జనం చేశాయి. మలేరియా వ్యాధికి గురయితే ఆనాడు అత్యధికులకు మరణం తథ్యం. లేదంటే దీర్ఘకాలం చలిజ్వరంతో వణుకుతూ తీవ్రంగా బాధపడేవారు. శతాబ్దం క్రితమే ఆనాటి నిజాం గోదావరి నదిపైన ఇంచంపల్లి ప్రాజెక్టును ప్రారంభించారు. నేటికీ నదీగర్భంలో ఆ ఆనకట్ట పునాదులను చూడవచ్చు. కానీ, ప్రాజెక్టు నిర్మాణం కోసం అక్కడ నివాసం ఏర్పరచుకున్న ఫ్రెంచి ఇంజినీర్లందరూ, వారి కుటుంబాల సహా మలేరియా వాత పడటంతో మరణించారు. వారి సమాధులు గోదావరి తీరంలోనే ఉన్నాయి. వారి మరణంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. నేటికీ అది అమలుకు నోచుకోలేదు. ఇప్పటికీ కొన్ని ఆఫ్రికా దేశాలలో పొట్ట మీద దెబ్బకొడితే హత్యానేరం మోపుతారు. ఎందుకంటే, ఆ ప్రాంతాలలో మలేరియాతో దాదాపు ప్రతి వ్యక్తి నిరంతరం బాధపడుతూ ఉంటాడు. మలేరియా తరచూ సోకటం వల్ల ఉదరకోశంలో ఎడమవైపున ఉండే ప్లీహం (స్ప్లీన్) బాగా లావైపోతుంది. అలా గడ్డకట్టిన ప్లీహం పైన చిన్న దెబ్బపడినా అది వెంటనే పగిలిపోయి లోపల రక్తస్రావం జరిగి మరణానికి దారితీస్తుంది. అందుకనే ఆ దేశాలలో పొట్టమీద దెబ్బను హత్యానేరంగా పరిగణిస్తారు. అలాగే ఓ వైరస్ వల్ల సంక్రమించే 'ఎల్లోఫీవర్' కు గురై ఆనాడు అసంఖ్యాకంగా మృత్యువాత పడేవారు. సుయాజ్ కాలువ తవ్వుతున్న కాలంలో లక్షలమంది ఆ విధంగా మరణించారు. ఇక దీర్ఘకాలం పీడించే క్షయ, కుష్టులాంటి అంటువ్యాధుల గురించి చెప్పనక్కర్లేదు. కుష్టువ్యాధి సోకినవారిని ఊరు నుంచి బహిష్కరించేవారు. ఆ వ్యాధి సోకినవారు సమాజానికి దూరంగా దుర్భర జీవితాన్ని గడిపేవారు. క్షయ సోకితే ఆనాడు నూటికి తొంభైమందికి మరణం తథ్యం. ఏళ్ల తరబడి మంచి ఆహారం, సరైన పోషణ ఉంటే కొందరు గండం గడిచి గట్టెక్కేవారు. దక్షిణ



భారతదేశంలో నేటికీ మనకు ఆరాధ్యుడైన సర్ ఆర్థర్ కాటన్- క్షయవ్యాధికి గురై తరువాత సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందిన కొద్దిమందిలో ఒకరు. ఆయన ఆస్ట్రేలియాలో రెండుసార్లు దీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. తెలుగువారి అదృష్టవశాన ఆయన బతికి బట్టకట్టారు. ఆయన భగీరథ ప్రయత్నంతో లక్షల ఎకరాలు నేటికీ సస్యశ్యామలంగా ఉన్నాయి.

## ఆవిష్కృతమైన అద్భుతాలు

గత శతాబ్దంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అకాలమరణం అరుదైంది. ఎన్నో వ్యాధులను నిరోధించటం, నివారించటం ఎలాగో అర్థమైంది. నివారించదగ్గ వ్యాధులు చాలావరకు అదుపులోకి వచ్చాయి. మశూచికం వ్యాధిని అసలు భూమి మీద నుంచే నిర్మూలించగలిగాం. పౌష్టికాహారాన్ని గురించి నేడు సంపూర్ణ అవగాహన మనకు ఉంది. దాంతో ఆరోగ్యం, దేహదారుఢ్యం, దీర్ఘకాల జీవనం సాధ్యమయ్యాయి. మాతృత్వం, గర్భిణి స్త్రీల ఆరోగ్యం, ప్రసవాన్ని గురించి పరిజ్ఞానం విశేషంగా పెరిగింది. దాంతో మాతృత్వం మరణాలకు దారితీయటం లేదు ఇప్పుడు. పుట్టిన బిడ్డల సంరక్షణ ఎలాగో ఇప్పుడు మనకు పూర్తిగా తెలుసు. శిశుమరణాలను చాలావరకు నివారించగలుగుతున్నాం. నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా వచ్చే అంటువ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోగలుగుతున్నాం. కలరా లాంటి వ్యాధులను అదుపు చేయగలిగాం. చాలా అంటువ్యాధులు సోకినా చికిత్స చేయటం ఎలాగో తెలుసుకున్నాం. వైరస్ వ్యాధులకు మినహా, మిగిలిన అన్ని రకాల సూక్ష్మజీవుల వల్ల, పరాన్నభుక్తుల వల్ల సోకే వ్యాధులకు ఆధునిక ఔషధాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. మలేరియాలాంటి వ్యాధులకు సునాయాసంగా చికిత్స సాధ్యమవుతుంది. సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించకుండా చికిత్స చేయడం గత శతాబ్దంలోనే సాధ్యమయింది. దాంతో

లక్షలమంది ప్రాణాలను కాపాడగలుగుతున్నాం. ఇవన్నీ ఆధునిక యుగం మానవాళికి అందించిన అద్భుత వరాలు. అందుకే ఒకనాడు 30 ఏళ్లలోపు ఉన్న సగటు జీవనకాలం ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలలో 75 సంవత్సరాలు దాటింది. మనదేశంలో కూడా 1950లో 32 ఏళ్లు ఉన్న సగటు జీవనపరిమితి ఈనాడు 65 ఏళ్లు దాటింది. ఆరోగ్యరంగం మనిషి జీవనాన్ని మానవ చరిత్రను సమూలంగా మార్చివేసింది. నేటికీ మనకు అంతుపట్టని జబ్బులున్నాయి. వైరస్ జబ్బులకు చికిత్స లేదు. వ్యాధి సోకకుండా టీకాలు కనిపెట్టగలిగితే వాటిని నివారించగలం. మశూచికం, పోలియో, ఎల్లోఫీవర్ లాంటి వ్యాధులను ఆరకంగానే అరికట్టటం సాధ్యమయింది. కానీ, టీకాలు ఇప్పటికీ లేని వైరస్ వ్యాధులు సోకితే నేటికీ వైద్యులు చేయగలిగింది చాలా తక్కువ. జలుబు, ఫ్లూ లాంటి చిన్నపాటి జబ్బులు సోకితే కొన్నాళ్లు అనారోగ్యం పాలై సహజంగానే కోలుకుంటాం. ఎయిడ్స్‌లాంటి తీవ్ర వ్యాధులకు ఆధునిక వైద్యం కొంతమేరకే చికిత్స చేయగలదు. అలాగే జన్యువులతో సంక్రమించే వ్యాధులు, లేదా వయసుతోపాటు బయటపడే రుగ్మతలు- మధుమేహం, రక్తపోటులాంటి వాటికి రోగనిదానమే తప్ప శాశ్వత చికిత్సగానీ, ఖచ్చితమైన నివారణగానీ లేవు. కణవిచ్ఛిన్నం వల్ల వచ్చే కీళ్లనొప్పులులాంటి వ్యాధులకు, శరీర ప్రవృత్తి వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల వచ్చే ఉబ్బసంలాంటి వ్యాధులకు కూడా ఆధునిక వైద్యంలో శాశ్వత నివారణ లేదు. ఇక ఎన్నో రకాలైన క్యాన్సర్లకు కూడా ఖచ్చితమైన చికిత్సగానీ, రోగనివారణగానీ లేవు. ఇలా ఆధునిక వైద్యానికి ఎన్నో పరిమితులున్న మాట వాస్తవం.

అయితే, గతంలో మానవాళిని పీల్చి పిప్పిచేసిన ఎన్నో తీవ్రవ్యాధులకు, అంటురోగాలకు, ఆహార లోపాలకు, మాతాశిశు మరణాలకు ఆధునిక వైద్యం, ప్రజారోగ్య పద్ధతులు నిర్దిష్టమయిన పరిష్కారాలను అందించాయి. ఈ నివారణ పద్ధతులు సులభంగా, చౌకగా మనకు అందుబాటులో ఉన్నాయి. రోగాల బారి నుంచి మానవుడిని శాశ్వతంగా కాపాడటం బహుశా మనిషికి ఏనాటికీ సాధ్యపడకపోవచ్చు. మనిషి జీవితకాలానికి నిర్దిష్టమయిన పరిమితి ఉంది కాబట్టి, ఏదో ఒక రుగ్మత క్రమక్రమంగా మనల్ని లంగదీసుకోకతప్పదు. కానీ, ముందెన్నడూ లేనంతగా ఈనాడు 70 ఏళ్ల వయసులో కూడా లక్షలమంది ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా, చలాకీగా పూర్ణజీవితాన్ని గడపగలుగుతున్నారు. అది ఆధునిక వైద్యం, శాస్త్రవిజ్ఞానం మనకందించిన అపూరూపమయిన వరం.

## నివారించదగ్గ క్లేశం

మనదేశంలో కూడా గత 50 ఏళ్లలో ఆరోగ్యరీత్యా గుర్తించదగ్గ ప్రగతి సాధించిన మాట వాస్తవం. ఇప్పటికీ అకాల మరణాలు, నివారించదగ్గ వ్యాధులు, సులభంగా చికిత్స చేయదగ్గ జబ్బులు అసంఖ్యాకంగా అమాయకుల్ని బలితీసుకుంటున్నాయి. ఇటీవల



'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలుచేసే వరకు- ప్రతిరోజు సుమారు 1000మంది బాలలు మనదేశంలో పోలియో వ్యాధికి గురయ్యేవారు. ఇదే దేశం దశాబ్దాల క్రితం పోలియో వ్యాధి నివారణ టీకాలు కనుగొన్న జోనాథన్ సాక్‌కు నెహ్రూ అవార్డునిచ్చి సత్కరించింది. అయినా ఆధునిక ఆరోగ్యఫలాలు మన ప్రజలకు అందకుండా పోయాయి. నేటికీ కోట్లమంది మలేరియాకు గురై, సరైన చికిత్స లేక అనారోగ్యం పాలవుతున్నారు. వారిలో లక్షలమంది అకాల మరణానికి గురవుతున్నారు. నివారించదగ్గ అంధత్వానికి కోటిమందికిపైగా లోనవుతున్నారు. మరో కోటిమందికి పైగా క్షయవ్యాధి బారినపడి తీవ్ర వేదన అనుభవిస్తున్నారు. కుష్టువ్యాధి పీడితులలో కూడా భారత్‌దే అగ్రస్థానం. ప్రతి ఏడాదీ.. 5-15 సంవత్సరాల మధ్య వయసున్న సుమారు మూడు లక్షలమంది బాలబాలికలు గొంతునొప్పికి సరయిన చికిత్స అందక గుండెజబ్బుకు గురవుతున్నారు. బాల్యంలో చికిత్స చేయని మామూలు గొంతునొప్పి రుమాటిక్ గొంతునొప్పికి దారితీసి, గుండె కవాటాలను చెడగొడుతుంది. ఈ స్వల్ప విషయం తెలియక ఎన్నో కుటుంబాలలో పిల్లల ఆరోగ్యం నాశనమయి, దీర్ఘకాల వేదనకు గురవుతున్నారు. గోటితో పోయేదానికి గొడ్డలిని ఉపయోగించాల్సి వస్తోంది. కేవలం యాంటీ బయోటిక్స్‌తో నివారించదగిన జబ్బుకు గుండె శస్త్రచికిత్స అవసరమవుతోంది. అది అందుబాటులో లేక, స్తోమతు లేక, డబ్బు ఖర్చు పెట్టినా వ్యాధిని అదుపుచేయలేక- ఇలా వివిధ కారణాల వల్ల ఎందరో మృత్యువాత పడుతున్నారు. ఇక కలుషితమైన నీటి వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులకు లెక్కే లేదు. పుట్టిన బిడ్డలలో నేటికీ ఎనిమిది శాతంపైగా ఏడాది తిరగకుండానే మరణిస్తున్నారు. ఇలా నివారించదగ్గ క్లేశాలు భారతదేశంలో ఉన్నంతగా మరెక్కడా కానరావు. ఇందుకు చాలా సులభ పరిష్కారాలు మన ముందున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో అమలయ్యే మార్గాలనేకం ఉన్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో డాక్టర్ అరోలీ దంపతులు దశాబ్దాల క్రితం తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఆరోగ్య ఫలితాలు చూస్తే-

మన సమస్యలను ఎంత సులభంగా పరిష్కరించవచ్చో విశదమవుతుంది.

## అరోలీ ఆదర్శం

వెల్లూరు వైద్య కళాశాలలో పట్టభద్రులయిన డాక్టర్ రజనీకాంత్ అరోలీ, ఆయన భార్య మేబెల్- ఇరువురూ అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి 1970లో మహారాష్ట్రలో మారుమూల ప్రాంతమయిన జాంఖేడ్‌లో నివాస మేర్పరచుకున్నారు. ఆ దంపతులకు ఆనాటికే ఓ విషయం స్పష్టంగా తెలిసివచ్చింది.నూటికి 90 జబ్బులకు ఖరీదయిన వైద్యంగానీ, ఎంబీబీఎస్ చదివిన డాక్టర్లుగానీ అక్కర్లేదు. ఎన్నో అంటువ్యాధులను సులభంగా గుర్తించి చికిత్స చేయవచ్చు. చాలా రోగాలకు వ్యాధి నిరోధక టీకాలిస్తే జబ్బు రాకుండా నివారించవచ్చు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో రకాల జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. పౌష్టికాహారం మెళకువలను పాటిస్తే చాలా వ్యాధులను నిరోధించవచ్చు. మాతాశిశుసంరక్షణ సూత్రాలను పాటిస్తే ఎందరో గర్భిణులను, పసిపాపలను రక్షించవచ్చు. వీటన్నింటికీ వైద్యులే అవసరం లేదు. అలాగని అసలు వైద్యులు అవసరమే లేదని కాదు. కొన్ని క్లిష్టమయిన వ్యాధులను గుర్తించడానికి, సరైన చికిత్స చేయటానికి, శస్త్రచికిత్సలకు, కొన్ని మందుల వాడకానికి విధిగా వైద్యులు కావాలి. ఈ సూత్రాన్ని గుర్తించిన అరోలీ దంపతులు 70 గ్రామాలలో సంప్రదాయంగా పనిచేస్తున్న మంత్రసానులను, ఇతర మహిళలను ప్రోత్సహించి శిక్షణనిచ్చారు. వ్యాధులను గుర్తించటంలో, సులభమయిన చికిత్సలు చేయటంల, ఆరోగ్య సూత్రాలను పాటించటంలో వారంతా నిష్ణాతులయ్యారు. ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణనివ్వటం కోసం, వైద్యుడి సహాయం అవసరమున్న రోగులకు చికిత్సనందించటం కోసం మాత్రం జాంఖేడ్‌లో అరోలీ దంపతులు ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వారి కృషి వల్ల అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు వచ్చాయి. 1970ల చివరినాటికి ఆ 70 గ్రామాలలోని లక్ష జనాభాకు ఆధునిక ఆరోగ్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఆ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు-జీవన కాలపరిమితి, మాతా శిశు మరణాలు, వివిధ వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య వగైరా అంశాలలో- ప్రపంచంలో సంపన్న దేశాలకు ఏరకంగానూ తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించగలిగారు. పెద్దగా చదువుకోని గ్రామీణ మహిళలకు శిక్షణనిచ్చి కొద్దిపాటి ఖర్చుతో, అధిక వనరులు లేకుండా, ఆధునిక ఆసుపత్రులు అవసరం లేకుండా సామాన్యులకు ఆధునిక ఆరోగ్యాన్ని అందించటం సాధ్యమని అరోలీ రుజువుచేశారు. 1979లో అరోలీ దంపతులకు మెగసెసే అవార్డు అందింది. ఆరో పంచవర్ష ప్రణాళికకు ఆరోగ్యరంగంలో జాతీయ సలహాదారుగా అరోలీని మన ప్రభుత్వం నియమించింది. ఆయన కృషిని అందరూ పొగిడారు.



కాగితం మీద ఆ విధానాలనే రాసిపెట్టారు. కానీ వాస్తవానికి ప్రజలకు ఆరోగ్యం అందకుండా చేశారు. గ్రామీణ మహిళలను ఎంపికచేసి శిక్షణనిచ్చేది పోయి, పలుకుబడి గలవాళ్ల పిల్లలను ఎంపికచేశారు. ప్రజలకు ఆరోగ్యం అందించే లక్ష్యంతోకాక ప్రభుత్వోద్యోగం దక్కి నెల జీతం వస్తుందనే ఆశతో వేలమంది యువకులు లంచాలిచ్చి ఆరోగ్య కార్యకర్తలుగా చేరారు. నాయకులకు, అధికారులకు చిత్తశుద్ధి, సంకల్పం, అవగాహన, సామర్థ్యం కొరవడటంతో ఆ పథకం నీరుగారిపోయింది. ఇప్పుడు పాలకులలో చాలామందికి అసలు అరోలీ పేరే తెలియదు. గూండాలకు నీరాజనాలందించి, లంచగొండులను నెత్తికెక్కించుకుని, అసమర్థులను అందలాలెక్కించే వ్యవస్థలో నిజంగా దేశాన్ని సమూలంగా సంస్కరించగల మహనీయుల కృషి ఫలితాలను పొందే విజ్ఞత కూడా కరవయింది. చీటికీమాటికీ వేలు, లక్షలు ఖర్చు చేసి ఖరీదయిన ఆసుపత్రులలో వైద్యం పొందగల సంపన్నులకు, నిజాం ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందే అవకాశమున్న నాయకులకు, అధికారులకు సామాన్యుల కడగండ్లు కానరావు. లక్షలమంది పేదలు, అల్పాదాయ వర్గాలవారు చిన్నచిన్న జబ్బులకు కూడా సరైన వైద్యసౌకర్యం లేక, వైద్యం అందుబాటులో లేక సతమతమవుతున్నారు. సంపన్నులు, విద్యావంతుల కంటే చిన్న రుగ్మతలకు పేదలు ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. అమూల్యమయిన కాలాన్ని పోగొట్టుకుంటున్నారు. ఓ బీద కుటుంబంలో ఎవరికయినా మలేరియా వస్తే అదో పెద్ద సంకటం. అందరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం ఉండాలేగానీ, అతి తక్కువ ఖర్చుతో, స్థానికుల సహకారంతో ఎవరికీ తీసిపోని ఆరోగ్య ప్రమాణాలను సాధించటం చిటికెలో పని. అరోలీ లాంటి వారి కృషి ఫలితంగా ఆ పరిజ్ఞానం మనకు అందుబాటులో ఉంది. ఆ ఫలితాలను అందరికీ అందించటం నాగరికులమనుకునే మన ప్రథమ కర్తవ్యం. బీదరికాన్ని నిర్మూలించాలంటే ఆరోగ్యాన్ని అందరికీ అందించే వ్యవస్థను నిర్మించాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఆగస్టు 05, 2002న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ❐

# కొత్త రాజకీయ శక్తులకు అవకాశం ఉందంటున్న ఏపీ



ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ శక్తులకు అవకాశ ముందనే భావన ప్రజల్లో ఉందని తాజాగా ఒక సర్వే తేల్చింది. రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి ఉందని, అయితే దీనివల్ల తెలుగుదేశం ప్రభుత్వం ఏమీ కొత్తగా పుంజుకోలేదని ప్రజలు భావిస్తున్నారు. అలాగే అంతా రాజధాని చుట్టూనే అనే భావనను కూడా జనం వ్యతి రేకిస్తున్నారు. పెద్ద రాజధానితో ఈ కేంద్రీకరణ వల్ల ప్రభుత్వం దూరమైపోతోందని వారు భావిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఏపీలోని 10 జిల్లాల్లో ప్రజలు, రైతుల అభిప్రాయాలతో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ నివేదికను రూపొందించింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం కోలుకోలేదని ఈ సర్వే అంతర్లీనంగా తెలిపింది. తెలుగుదేశం ప్రభుత్వానికి అన్ని రకాలుగా ఎదురులేని పరిస్థితి ఉన్నా సద్వినియోగం చేసుకోవటంలేదని, అంతా ముఖ్యమంత్రి చుట్టూనే కేంద్రీకృతమై కొనసాగుతోందని స్పష్టంచేసింది. 2014 ఎన్నికలలో ఎలాగైనా గెలవటానికి తెదేపా అనుసరించిన అక్రమ ధనరాజకీయాలు ఈ పరిస్థితికి మూలమని స్పష్టంగా చెప్పలేకపోయినా, ప్రభుత్వంలో ఉన్నవారిలో ఒక్కరు కూడా మంత్రిస్థాయి వ్యక్తి లేరని ప్రజలు పెదవి విరిచారు. చంద్రబాబు కష్టపడుతున్నారని ఎక్కువమంది భావిస్తున్నారు. అయితే ఫలితం కనిపించటం లేదంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రికి ప్రజల మద్దతుకన్నా సానుభూతి ఎక్కువగా ఉంది. విద్యుత్తు సరఫరా, పింఛన్లు వంటి రోజువారీ పాలనా వ్యవహారాల్లో సంతృప్తి వ్యక్తమైంది. అయితే దుబారా ఎక్కువగా జరుగుతోందని ప్రజలు గుర్తించారు. ఇంకా అవినీతి బాధితులుగానే కొనసాగుతున్నామని చెప్పారు. రైతులు రుణమాఫీ గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు కానీ వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారంలో చంద్రబాబు ప్రభుత్వం సరైనరీతిలో వ్యవహరించటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో మిషన్ కాకతీయకు వచ్చిన స్పందన ఇక్కడ చెరువుల పూడికతీతకు చేపట్టిన కార్యక్రమాలకు రావటం లేదు. మంత్రులు, నేతలు, చివరకు తెదేపా కార్యకర్తలు కూడా యాంత్రికంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పనితీరు పట్ల ప్రజల్లో ఇంకా విశ్వాసం కనిపిస్తున్నా, ఏపీ కన్నా తెలంగాణలో పనులు మెరుగ్గా జరుగుతున్నాయనటం, కీలకాంశాల్లో తెదేపా విఫలమైందని భావిస్తుండటం, రాజకీయ శూన్యత భర్తీ పట్ల ఆసక్తి చూపుతుండటం మారుతున్న పరిస్థితులకు సంకేతంగానే భావించాలి. రాష్ట్రంలో మెజారిటీ జనాభాకు జీవనోపాధిని, ఆదాయాన్ని ఇచ్చే వ్యవసాయరంగంలో అస్తవ్యస్త పరిస్థితులపై, పరిశ్రమలకు భూసేకరణ, ఏర్పాటు తీరుపై చంద్రబాబు ప్రభుత్వం మాటలకు, చేతలకు ఎంతో అంతరం ఉందని కొన్ని నెలలక్రితం కూడా సీఎంఎస్ ఛైర్మన్ ఎన్.భాస్కరరావు నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఏపీలో ఇప్పుడున్న పరిస్థితుల్ని చక్కదిద్దాలంటే ఆటగాళ్లుకాదు, ఆటనియమాలు మారాల్సిందే అని చాలా స్పష్టంగా తాజా నివేదిక కూడా వెల్లడిస్తోంది. ఆటగాళ్లు మారుతున్నా పరిస్థితులు మారటం లేదని ప్రజలు సరిగానే విషయాన్ని గుర్తిస్తున్నారుగానీ దానికి, ఓటుకు ఉన్న సంబంధాన్ని గుర్తించటం లేదు. ఓటు పర్యవసానాలను చాలా లైట్ తీసుకుంటున్నారు. ఏదోకరకంగా ఓటు వేసేయటం, తర్వాత దిగిపో, దిగిపో అనటం తప్ప కాస్త ఆలోచించి సరైన వారికి ఓటు వేయటం ఇంకా ఆచరించటం లేదు. ఇది మారేంతవరకూ ఎన్నికలు ఒక తంతులాగానే జరుగుతుంటాయి, ప్రజలు నష్టపోతూనే ఉంటారు. తక్షణ అవసరాలకు–దీర్ఘకాలిక ప్రయోజనాలకు మధ్య సమన్వయం సాధించటానికి ఈ వ్యవస్థీకృత మార్పులను చంద్రబాబు ఏమేరకు అమలుచేయగలుగుతారో వేచిచూడాలి. ఎమ్మెల్యేల మీద, వేలకోట్ల డబ్బు మీద ఆధారపడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రుల్ని ఓటర్లే ప్రత్యక్షంగా ఎన్నుకోవాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనను కూడా ఆయన ఈ సర్వే నేపథ్యంలో సీరియస్‌గా పరిశీలించాల్సుంది. ❐

# కార్మికులను సంఘటితం చేసిన లోఖాండే




భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి నాంది పలికినవారిలో నారాయణ్ మేఘాజీ లొఖాండే ప్రముఖులు. మొట్టమొదటి కార్మిక పత్రికగా పేర్కొనదగ్గ 'దీనబంధు'కి ఎడిటర్గా ఆయన వ్యవహరించారు. బొంబాయిలో తొలి కార్మిక సమావేశాన్ని నిర్వహించారు. మిగతా నాయకుల్లా కార్మికుల జీవనస్థితిగతులను గురించే కాకుండా, కులం, అంటరానితనం వంటి సామాజిక దుర్మార్గాల మీద కూడా లొఖాండే పోరాడారు. బొంబాయి మిల్-హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న లొఖాండే 1890లో బంబాయి ప్రెసిడెన్సీ కమిషన్ అసోసియేషన్ సభ్యుడిగా నియమితుడయ్యారు. అనేకమంది స్త్రీపురుష కార్మికుల దుస్థితిని ప్రత్యక్షంగా కమిషన్ దృష్టికి తీసుకురావటంలో లొఖాండే విశేష కృషి చేశారు. కానీ ఈనాటి ట్రేడ్ యూనియన్ నాయకులుగా చెలామణి అవుతున్న చాలామందికి లఖాండే గురించి తెలియదు. లఖాండే పనిచేసిన సత్యశోధక సమాజం నామమాత్రం కావటం, కొంతమంది సోషలిస్ట నాయకులు లొఖాండేను పట్టించుకోకపోవటం వల్ల చాలాకాలంపాటు ఆయన కృషి వెలుగుచూడలేదు.

లొఖాండే 1848లో బంబాయి సమీపంలోని థానే వద్ద ఒక పేద కుటుంబంలో జన్మించారు. జోతిబా ఫూలే, భాలేకర్లలాగే పూలూమాలి కులానికి చెందినవారు కావటంతో వీరు పట్టణపరిసర ప్రాంతాలలో నివశిస్తూ పూలు, పళ్లు, కూరగాయలను పట్టణంలో అమ్ముకుంటూ జీవించే వృత్తిలో ఉండేవారు. పట్టణాలకు దగ్గరగా ఉండటంతో పూలూమాలిలకు పాశ్చాత్య విద్య నేర్చుకునే అవకాశం లభించింది. బ్రాహ్మణేతరులలో పాశ్చాత్య విద్యను నేర్చుకుంది మొదట పూలూమాలిలే. 1874 నాటికి లొఖాండే స్కూలు విద్యను పూర్తి చేసుకుని, బొంబాయిలోని ఒక నూలుమిల్లులో స్టోర్కీపర్గా పనిచేస్తున్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగాను, స్త్రీ-పురుష సమానత్వం కోసమూ మహాత్మాపూలే మహోద్యమం నిర్వహిస్తున్న రోజులవి. ఛాందస ఆచారాల చట్రాన్ని ఛేదించి అనేకమందికి వెలుగుబాట చూపిన ఫూలేని చూసి లొఖాండే ముగ్ధుడయ్యారు. సత్యశోధక సమాజంలో సభ్యునిగా చేరారు. 1880లో దీనబంధు పత్రికను ఎడిట్ చేసే బాధ్యతలు స్వీకరించి, స్టోర్కీపర్ ఉద్యోగాన్ని వదిలేశారు. 1897లో ప్లేగు వ్యాధితో మరణించేంత వరకూ లొఖాండే తన దీనబంధు ప్రచురణని ఆపలేదు.

లొఖాండే కృషిని ఒక్కసారి పరిశీలించిన వారెవరికైనా ఆయనకు, మే 1వ తేదీన మొక్కుబడిగా కార్మిక దినోత్సవం నిర్వహించే సాధారణ ట్రేడ్ యూనియన్ నాయకులకు మధ్య తేడా స్పష్టంగా అర్థమవుతుంది. కార్మికుల జీవితాల్లో కీలక మార్పులు తెచ్చేందు లొఖాండే కృషి చేశారు. 1884, సెప్టెంబర్ 23న జరిగిన కార్మిక సమావేశంలో ఆదివారం సెలవు, పని మధ్య విశ్రాంతి, పనిగంటల తగ్గింపు వంటి ముఖ్యమైన డిమాండ్లను ఆయన చేశారు. సుమారు 5,500 మంది కార్మికుల సంతకాలతో కూడిన విజ్ఞాపనపత్రాన్ని ప్రభుత్వానికి సమర్పించారు. లొఖాండేతోపాటు ఎస్.ఎస్ బెంగాలీ అనే మరో కార్మిక సానుభూతిపరుడు కూడా ఈ కృషిలో విశేష పాత్ర పోషించారు. వీరిద్దరి కృషి ఫలితంగా ప్రభుత్వం చాలా డిమాండ్లను ఆమోదించింది. 1889లో సరకు పేరుకుపోయిందన్న సాకుతో వారానికి రెండురోజులు మిల్లులు మూసివేస్తామని మిల్లు యజమానులు చేసిన తీర్మానాన్ని లొఖాండే ఒక సంఘటిత శక్తిగా తిప్పికొట్టారు. 1890, ఏప్రిల్ 24న 10వేల మంది కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. చివరికి 1890, జూన్ 1న ఆదివారం సెలవు లభించింది. జీతాలివ్వటానికి తేదీ నిర్ణయించారు. ప్రమాదాలకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ ప్రగతి అంతా చికాగోలో మే డే అనేది ప్రారంభంకావటానికి ముందే,

అంటే 1886, మే ఒకటవ తేదీకి ముందే భారతదేశంలో జరిగింది. (మనదేశంలో మొదటి మే డే ఉత్సవం 1923లో జరిగింది. సింగరవేలు షెట్టియార్ అనే ఆయన మద్రాస్‌లో హిందూస్థాన్ లేబర్ కిసాన్ పార్టీని స్థాపించి మొదటి మే డే ర్యాలీని నిర్వహించారు. ఎం.ఎన్ రాయ్‌తో ఈయనకు సాన్నిహిత్యం ఉండేది)

## 1893లో హిందూ, ముస్లిం ఘర్షణలు

బొంబాయిలో మొదటిసారిగా 1893 ఆగస్టు 11న హిందూ, ముస్లిం ఘర్షణలు చెలరేగాయి. వారం రోజులపాటు జరిగిన హింసాకాండలో 80మందికి పైగా చనిపోయారు. కోట్లాది ఆస్తి ధ్వంసమయింది. ఈ సంఘటనలతో బెదిరిపోయిన కార్మికులు తమ భార్యాబిడ్డలను వదిలిరావటానికి ఇష్టపడక పనులనే వదులుకున్నారు. పదిహేను నూలుమిల్లులు మూతపడ్డాయి. లోఖాండే, సత్యశోధక సమాజానికి చెందిన ఇతర కార్యకర్తలు అవిశ్రాంతంగా కార్మికవాడల్లో తిరిగి వారికి ధైర్యాన్ని ఉద్బోధించారు. మతకలహాలలో దెబ్బతిన్నవారిని ఆదుకునేందుకు దీనబంధు ద్వారా విరాళాలు సేకరించారు. హిందూ, ముస్లిం తేడా లేకుండా బాధితులైనవారందరికీ సహాయం అందచేశారు. హిందూ, ముస్లిం ఐక్యత కోసం 'ఐక్యతా మేళా' అనే పండుగను బైకుల్లా జూలో నిర్వహించారు. దాదాపు 60వేలమంది ప్రజలు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. కార్మికవర్గ నాయకునిగా మతకలహాలను అడ్డుకోవటం తన ప్రధాన బాధ్యతగా లోఖాండే భావించారు. 1895లో ఈ కృషికి గుర్తింపుగా బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 'రావుబహద్దూర్' బహూకరించింది.

కొందరు జాతీయనేతలు ప్రాణానికి ప్రాణం అంటూ హిందువులను ముస్లింల మీదకు ఉసిగొల్పుతున్న దశలో, తప్పు చేసినవాళ్లు ఏ వర్గంలో ఉన్నా శిక్ష ఒక్కటే, ఇరుమతాలూ సమానమే అని లోఖాండే పేర్కొన్నారు. హిందూమతంలో స్త్రీలను అణచివేయటాన్ని, వితంతువులకు గుండుకొట్టించటం వంటి వాటిని ప్రముఖ జాతీయనేతలుగా పేరుపొందినవారు కూడా సమర్థించగా లోఖాండే తీవ్రంగా వ్యతిరేకించారు. వితంతువులైన మహిళలు అగ్రకులస్తులమని చెప్పుకున్నా సరే గుండుగీయవద్దని నాయీబ్రాహ్మణులను లోఖాండే అభ్యర్థించారు.

లోఖాండే స్ఫూర్తితో, లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ అందించిన అవకాశంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఎక్కడికక్కడ స్వతంత్ర సహకార సంఘాలుగా ఏర్పడి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆశిద్దాం. ❐



# శతాబ్దాల మడ్డిని కడిగిపారేసిన జిడ్డు కృష్ణమూర్తి




జిడ్డు కృష్ణమూర్తి పెద్దపెద్ద యూనివర్సిటీలలో చదువుకోలేదు. గొప్పగొప్ప సిద్ధాంతాలను వల్లె వేయలేదు. కానీ సమాజాన్ని, చుట్టూ ఉన్న ప్రకృతిని పట్టించుకోవటం వల్ల ఎన్నో విషయాల గురించి మాట్లాడారు. చావుపుట్టుకల గురించి, ఈ రెండింటి మధ్యన చేజేతులారా మనుషులే తమ జీవితాల్ని అల్లకల్లోలం చేసుకుంటున్న తీరు గురించి చాలా సీదాసాదాగా విప్పి చెప్పారు. చావు తర్వాత ఏదో అమరత్వ జీవితాన్ని గడపాలనే భ్రమలో మతాన్ని ఆశ్రయించిన వాళ్లని కృష్ణమూర్తి కడిగిపారేశారు. సమస్యల్ని చూసి భయపడే మనసు రక్షణ కోసం దేవుడ్ని సృష్టించుకుంటుంది. దేవుడికన్నా దేవుడు ఉన్నాడు అనే భావన మనిషికి ఎంతో ఓదార్పునిస్తుంది. ఇది నిజమైన జీవితమా? ఇంతకంటే పెద్ద భ్రాంతి ఇంకోటి ఉండదు.

కృష్ణమూర్తి సూటిగా చెప్పేదొకటే- హిందూ, ముస్లిం, క్రైస్తవ, కమ్యూనిస్టు, ఫెమినిస్టు, ఆసియన్, యూరోపియన్, అమెరికన్ తదితర భావాలు నీలో ఉన్నంతవరకు నీకు స్వేచ్ఛ లభించదు. ఏదోక సిద్ధాంతాన్ని ఆశ్రయించి స్వేచ్ఛ కోసం పరుగులిడితే నీకు స్వేచ్ఛ లభించదు. నీకు నిజమైన స్వేచ్ఛ లభించాలంటే దేన్నీ ఆశ్రయించకుండా స్వచ్ఛమైన మనిషిలా జీవించు. మతం పేరు మీద ఎంతమంది మరణించారో అభ్యుదయం పేరు మీద కూడా అంతమంది మరణించారు. మనసులో చైతన్యం లేకుండా బయట ఎన్ని వత్తిడులు తీసుకొచ్చినా ప్రయోజనం ఉండదు. మనకు ప్రశ్నించటం అలవాటు లేదు. ఎవరిచేతో చెప్పించుకోవటానికి, ఎవరో చెప్పినట్టు నడుచుకోవటానికి మనం అలవాటు పడిపోయాం. వేలాది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. ఇది మారాలి. ప్రశ్నించండి-పరిశీలించండి-స్వేచ్ఛగా బాధ్యతగా నిర్ణయాలు తీసుకోండి. సుఖాన్ని బజారులో కొనుక్కోవచ్చు. కానీ నిజమైన మానసిక ఆనందం మాత్రం మీలో నుంచే రావాలి. స్వచ్ఛమైన జీవితం ద్వారానే దాన్ని పొందగలం. నీ చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా ఉన్నా నువ్వు నిజాయతీగా మార్పు కోసం కృషి చెయ్యి. చిరుదీపం కాగడా అవుతుంది.

కృష్ణమూర్తి చెప్పిన విషయాల్ని ఇలా చెప్పుకుంటూ పోతే కాలాన్ని మర్చిపోతాం. అసలు కృష్ణమూర్తి కూడా ఒక తత్వవేత్తేనా అని అడిగిన వాళ్లున్నారు. నిజాల్ని తెలుసుకోవటానికి, చెప్పటానికి ఎటువంటి అర్హతలూ అక్కర్లేదు. 60 ఏళ్లపాటు ప్రపంచంలోని వివిధ దేశాల్ని అతిథిలా పలకరించి ప్రసంగాలు చేశారు కృష్ణమూర్తి.

**ఆచరించనంత వరకూ తెలియనట్టే లెక్క**

ఏంటీ! చెప్పిన విషయాన్ని పదేపదే చెబుతున్నారు, మాకు తెలియదా? అని విసుక్కునేవారికి కృష్ణమూర్తి చాలా చక్కటి సమాధానం చెప్పారు. ఆచరించనంత వరకూ ఆ అంశం తెలియనట్టే లెక్కని, కాబట్టి మంచి, ముఖ్యమైన విషయాల్ని మళ్లీమళ్లీ చెబుతుండాల్సిందేనని ఆయన అంటారు. ప్రజల్లో మార్పు రావటానికి విద్యావ్యవస్థను సమూలంగా మార్చాలని, విద్యార్థులకన్నా ముందు తల్లిదండ్రులకు సరైన బోధన చాలా అవసరమని చెబుతుండేవారు. వ్యక్తిగత స్థాయిలో ఫౌండేషన్ ద్వారా కొన్ని ఉత్తమ పాఠశాలల్ని నెలకొల్పారు. మే 11న ఈ మానవీయ పరివర్తనకారుని పుట్టిన రోజు. ❐

## దగాపడ్డవర్గాలు ఏకం కావాలి

తమ సమస్యల పరిష్కారం కోసం దగాపడ్డ ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీలు ఏకం కావాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ జిల్లా నేతల సమావేశంలో అన్నారు. ఇష్టమొచ్చినట్టు ఓటు వేయకుండా మార్పు కోసం డా॥ అంబేద్కర్ చెప్పినట్టు రాజ్యాధికారాన్ని మాస్టర్ కీగా ఉపయోగించేలా ఈ వర్గాల్లో చైతన్యం నింపుతామన్నారు. వ్యవస్థలో 80శాతం ప్రజల భాగస్వామ్యం లేకుంటే ఈ దేశం నిలబడదన్నారు. విజయనగరంలో విచ్చలవిడి మద్యంపై కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించిన కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు ఇప్పుడు తన పార్టీ ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్ పాలనపై మాట్లాడటం లేదన్నారు. జిల్లాను తాగుబోతుల జిల్లాగా మార్చారన్నారు. ఎంఆర్‌పీకి మించి అమ్ముతూ పేదల డబ్బును, ఆరోగ్యాన్ని నాశనంచేస్తున్నారన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు ఆర్.సుధాకర్, పద్మావతి, బాలా, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

# లోక్‌సత్తా పోరాటం ఐపీఎల్ మీద కాదు, మహారాష్ట్రకే పరిమితం కాదు

## నీటి ఎద్దడి, పాలనా వైఫల్యం, పెరుగుతున్న అంతరాలపై అన్ని రాష్ట్రాలూ పోరాడాలి: సురేన్



మహారాష్ట్రతోపాటు వివిధ రాష్ట్రాలలో తీవ్ర నీటిఎద్దడిని, పాలకుల వైఫల్యాన్ని, సమాజంలో పెరుగుతున్న అంతరాలను దేశప్రజల దృష్టికి తేగలిగామని, పాలకులు, సామాజిక స్పృహలేని సంపన్నులను బోనెక్కించామని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. నీటికొరత ఉన్న మహారాష్ట్రలో ఐపీఎల్ నిర్వహణకు వ్యతిరేకంగా లోక్‌సత్తా దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి హైకోర్టు స్పందించి ఏప్రిల్ 30 తర్వాతి క్రికెట్ మ్యాచ్‌లను వేరే ప్రాంతాలకు తరలించాలని ఆదేశించటంపై ఆయన మాట్లాడుతూ.. లోక్‌సత్తా కోరుకున్నది నీటిసమస్యపై చర్చ జరిగి పరిష్కారాలు అమలవ్వాలనే తప్ప మ్యాచ్‌లను తరలించాలని కాదని అన్నారు. లోక్‌సత్తా 'పిల్'పై న్యాయవ్యవస్థ సానుకూలంగా స్పందించి బాధ్యులెవరికీ తప్పించుకునే అవకాశమివ్వలేదని హర్షం వ్యక్తంచేశారు. అరుదైన పరిస్థితుల్లో తప్ప కోర్టులకు వెళ్లాలని లోక్‌సత్తా భావించదని, మహారాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై తాము విధిలేని పరిస్థితుల్లోనే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. లాల్‌బాగ్, థానే తదితర ప్రాంతాల్లోని లోక్‌సత్తా సభ్యుల్లో అనేకమంది మూడు నెలలుగా నీటి కోసం ఎప్పుడొస్తాయో తెలియని ట్యాంకర్ల మీదే ఆధారపడివున్నారని, హోలీ పండగను నీళ్లు లేకుండా జరుపుకోవాలని కూడా పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఐపీఎల్ కోసం మాత్రం 60-70లక్షల లీటర్ల నీటిని మారుమాట్లాడకుండా సరఫరా చేయటానికి సిద్ధపడ్డారని, ఈ నేపథ్యంలోనే విధిలేని పరిస్థితుల్లో ఐపీఎల్‌కు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించామని వివరించారు. క్రికెట్ తనకు ఎంతో ఇష్టమైన ఆటని, స్వయంగా కార్పొరేట్ మ్యాచ్‌లలో ఆడానని, ఆట మీద ప్రేమ కన్నా కూడా నీటిసమస్య తీవ్రమైనది కాబట్టే పిల్ వేశామన్నారు. 1996లో లోక్‌సత్తా హైదరాబాద్‌లో ప్రారంభమయిందని, 2001 నుంచి ముంబయిలో కార్యక్రమాల్ని మొదలుపెట్టిందని అన్నారు. రాజకీయ, పాలనా సంస్కరణల కోసం ఈదేశంలో ఏ సంస్థా చేయని స్థాయిలో కృషి చేస్తూ గణనీయ ఫలితాలను సాధించిన లోక్‌సత్తా ఈ పిల్‌ను, తదనంతర పరిణామాలను కూడా పాలనావ్యవస్థలో ప్రక్షాళనకు ఒక అవకాశంగా భావిస్తోందన్నారు. మహారాష్ట్రలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులున్నా, రైతుల పేరుతో వేలకోట్లు ఖర్చుచేసినా నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోలేకపోవటం ఓ పెద్ద కుంభకోణం, పూర్తిగా పాలనా వైఫల్యం అన్నారు. విపత్తుల సమయంలో ప్రజల కోసం వితరణ మ్యాచ్‌లు ఆడిన చరిత్ర క్రికెట్ సంఘాలకుందని, ఐపీఎల్ నిర్వహణకు అనుమతి ఇచ్చేటప్పుడే వారి లాభాలను ప్రజల నీటి సమస్య పరిష్కారంలో భాగంగా చేయాలన్న ఆలోచనే మహారాష్ట్ర ప్రభుత్వానికి కలగలేదన్నారు. ఐపీఎల్‌కున్న ఆదరణను ఉపయోగించుకుని సింబాలిక్‌గా లోక్‌సత్తా చేసిన న్యాయపోరాటం వల్ల నీటిసమస్య, రాష్ట్ర ప్రభుత్వ దుష్పరిపాలనపై విస్తృత ప్రచారం లభించిందన్నారు. ఐపీఎల్ నిర్వహించే సంపన్నులకు, భాగస్వాములైన క్రికెటర్లకు ప్రజల సమస్య పట్టదా? అంటూ క్రికెట్‌ను అమితంగా ప్రేమించే యువత కూడా లోక్‌సత్తాకు మద్దతు పలికారన్నారు. ఇది కేవలం ఐపీఎల్‌కో, ప్రచారానికో పరిమితమైతే ప్రయోజనం ఉండదన్నారు. ఐపీఎల్ పోయినంత మాత్రాన తమకేమీ నష్టంలేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు దులుపుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని అన్నారు. ఖచ్చితంగా నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి, వార్డు స్థాయిలోకి, పంచాయతీ స్థాయిలోకి అధికార వికేంద్రీకరణకు, ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళనకు, వ్యవసాయరంగంలో మార్పులకు, సామాజిక ప్రజాస్వామ్యానికి ఈ ప్రయత్నం, ప్రచారం దారితీయాలన్నారు. కోర్టు కూడా తదుపరి విచారణల్లో నీటిసమస్య పరిష్కారంపై ముఖ్యమంత్రి నుంచి సంబంధిత అందరినీ బోనులో నిలబెట్టి స్పష్టమైన పరిష్కారాల దిశగా కదిలిస్తుందని ఆశిస్తున్నామన్నారు. పేరుకు మహారాష్ట్రకు సంబంధించిన పోరాటమైనా, ఇది దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకూ వర్తించేదని, ఈ సమస్యలపై ప్రజలు ఎక్కడికక్కడ రాజకీయ, పాలనా వ్యవస్థలను నిలదీసి పరిష్కారాలను సాధించుకోవాలని, అవకాశమున్నచోట లోక్‌సత్తా కార్యకర్తలు వారికి అండదండల్ని అందించాలని సురేంద్ర శ్రీవాస్తవ విజ్ఞప్తి చేశారు. ❐

# నీటి కరవూ నేటి క్రికెట్టూ

- రాజ్‌దీప్ సర్దేశాయ్

గ్రామీణ పేదరికం గురించి ప్రముఖ పాత్రికేయుడు పాలగుమ్మి సాయినాథ్ కొన్ని సంవత్సరాల క్రితం ఆలోచనాత్మకమైన వ్యాఖ్యనొకదాన్ని చాలా చమత్కారపూరితంగా చేశారు. 'ప్రతి ఒక్కరూ ఒక మంచి కరవును ఇష్టపడుతున్నారు' (ఎవ్రిబడీ లవ్స్ ఎ గుడ్ డ్రాట్) అన్నదే ఆ వ్యాఖ్య. ఇదే సాయినాత్ సుప్రసిద్ధ పుస్తకం శీర్షిక కూడా. పల్లె భారతిని పెద్దగా పట్టించుకోని ప్రైమ్ టైమ్ టెలివిజన్ సైతం ఇప్పుడు నీటికొరత, అన్నదాతల ఆత్మహత్యలు మొదలైన గ్రామీణ భారత సమస్యలకు సముచిత ప్రాధాన్యమిస్తోంది.




ఈ మార్పుకు కారణమేమిటి? ఆరుగాలమూ శ్రమించే రైతును పట్టించుకోవాలన్న ఇంగితజ్ఞానం కలగడం వలనా? కానేకాదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో సెలబ్రిటీ క్రికెటర్ల పట్ల అశేష ప్రజల ఆరాధన, కార్పొరేట్ జార్‌ల విలాస వైభవాలు మొదలైన పట్టణ భారతపు జీవన దృశ్యాలకు పూర్తిగా భిన్నమైన ఎండిపోయిన భూములు, నీళ్లు రాని ట్యాప్‌ల వద్ద రాకపోతాయా అన్న ఆశతో ఉసూరుమంటూ ఎదురుచూస్తున్న మహిళల బారులు మొదలైన గ్రామీణ జీవన చిత్రాలను గమనించిన తరువాత ఎవరైనా ఈ వాస్తవ దృశ్యాలను ఎలా ఉపేక్షించగలరు? టీవీ ఛానల్స్ అనివార్యంగానే కరవు విషాదాలను చూపిస్తున్నాయి.

క్రికెట్ పేరిట కోట్ల రూపాయల దుబారాను దుయ్యబట్టటం కంటే రైతన్య దీనావస్థ గురించి మరో తీరులో ప్రభావపూరితంగా మాట్లాడటం సాధ్యమవుతుందా? కరవు కరాళ నృత్యం చేస్తున్న వేళ క్రికెట్టే సర్వస్వమవడం పట్ల బాంబే హైకోర్టు ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను మహారాష్ట్ర నుంచి వేరే ప్రదేశాలకు తరలించాలని (లోక్‌సత్తా దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో) బీసీసీఐని హైకోర్టు ఆదేశించింది. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు క్రీడా మైదానాన్ని అనువుగా ఉంచేందుకు 40 నుంచి 60 లక్షల లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు మరి. గుక్కెడు నీళ్లు దొరకక దాహార్తితో అల్లల్లాడిపోతున్న ప్రజలు ఎంతమంది లేరు? క్రికెట్ మైదానం నిర్వహణకు ఉపయోగించే నీటిని ఆ దాహార్తులకు ఎందుకు ఇవ్వకూడదు? విదర్భ, మరత్వాడా మెట్ట భూముల సాగుకు ఆ నీటిని వినియోగించుకోవచ్చు కదా. ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులకు సామాజిక బాధ్యత లేదా? ఉన్నదనే విషయాన్ని వారెలా విస్మరించారు?

నిజమే, క్రికెట్ అభిమానుల పట్ల గానీ, భారతీయ రైతుల పట్లగానీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు ఎటువంటి నైతిక బాధ్యత చూపించటం లేదు. అయితే కరవు, వరద బాధితులను ఆదుకోవడానికి బీసీసీఐ ఒకప్పుడు ప్రత్యేక మ్యాచ్‌లను నిర్వహించేది. వాటి ద్వారా వచ్చిన ఆదాయాన్ని పూర్తిగా బాధితుల పునరావాసానికి వినియోగించేవారు. ఈ ధర్మకార్యంలో క్రికెట్ క్రీడాకారులు బీసీసీఐకి పూర్తిగా సహకరించేవారు. మరి ఐపీఎల్ ఫ్రాంఛైజీ యజమానులు తమ ఆర్థిక స్తోమత దృష్ట్యా ఇప్పుడు తమకు తాముగా ప్రకృతి విపత్తుల బాధితులను ఆదుకోవాలి. వేలాది ప్రజలకు అండగా నిలవడానికి అవసరమైన ఆదాయం బీసీసీఐకి ఉన్నది. బీసీసీఐ ప్రస్తుత ఛైర్మన్, భారతీయ రైతుల ఆత్మహత్యల రాజధానిగా పేరుమోసిన విదర్భ ప్రాంతానికి చెందిన పెద్దమనిషే. అయినా కరవు బాధితులను ఆదుకునే విషయంలో బీసీసీఐ ఎందుకో అలసత్వం చూపుతోంది. క్షమార్హంకాని ఉదాసీనతతో వ్యవహరిస్తోంది. (లోక్‌సత్తా) ప్రజాహిత వ్యాజ్యం పుణ్యమా అని బీసీసీఐ వైఖరిలో మార్పు వచ్చింది. ఏమైనా క్రికెట్ బాస్‌లు, మ్యాచ్‌లపై వ్యాఖ్యానం ఎవరు చేయాలనే విషయంపై చూపుతున్న శ్రద్ధను తమ సామాజిక బాధ్యతల విషయంలో చూపడం లేదన్నది స్పష్టం.

గతవారం మరత్వాడా ప్రాంతంలో పర్యటించాను. వరసగా రెండు సంవత్సరాలు తీవ్ర కరవును ఎదుర్కొన్న ప్రాంతమది. జలాశయాలలో చుక్కనీరు కనిపించలేదు. వరసగా నాలుగు పంటలు ఎండిపోయాయి. శ్రమఫలం ఏమాత్రం దక్కని రైతన్నల పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. లాతూర్ పట్టణంలో తాగునీటిని సరఫరా చేసే ట్యాంకర్లు వచ్చినప్పుడు అక్కడ సంభవించే 'పానీపట్టు యుద్ధాల'ను నివారించడానికి అధికారులు

144వ సెక్షన్ విధించక తప్పలేదు. ఇది తెలిసిన తరువాత మీడియా, రాజకీయ వర్గాలూ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను ఉపేక్షించి 'భారత మాతా కీ జై' నినాదం విషయమై అనవసర వివాదాలకు ప్రాధాన్యమిస్తున్నాయని గుర్తించక తప్పలేదు. 'జాతీయవాద' నినాదాలు చేయడం వల్ల తీవ్రమవుతోన్న నీటిసంక్షోభం తీరిపోదు. జలవనరుల నిర్వహణ, నీటి సరఫరాలో లొసుగులను నిజాయతీగా సమీక్షించుకున్నప్పుడే పరిష్కారాలు సాధ్యమవుతాయి.

ఉదాహరణకు మహారాష్ట్రలో పంటల సాగు తీరుతెన్నులను గమనించండి. అవి తలకిందులుగా ఉన్నాయి. మరే పంట కంటే చెరకు సాగుకే అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్రంలో ఉపయోగించుకొంటున్న సాగునీటిలో సగభాగానికి పైగా చెరకు పంటకే వినియోగమవుతోంది. మరి మహారాష్ట్రలో నీటిపారుదల సదుపాయమున్న భూమిలో చెరకును సాగుచేసేది కేవలం ఆరుశాతం భూమిలోనేనన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. నిపుణుల అంచనా ప్రకారం, ఒక ఎకరంలో చెరకు సాగుకు 1.80 కోట్ల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఇదే నీటితో ఒక నెలరోజుల పాటు 3000 గ్రామీణ కుటుంబాల అవసరాలను తీర్చవచ్చు. మరి ప్రస్తుత విషమ పరిస్థితి దృష్ట్యా చెరకుకు బదులుగా వేరే పంటలు సాగుచేయమని ఏ రాజకీయవేత్త అయినా రైతులకు విజ్ఞప్తి చేయగలడా?



నీటిపారుదల రంగంలో పరిస్థితులను మెరుగుపరచడానికి మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన కృషి ఏమిటి? కాంగ్రెస్–ఎన్సీపీ సంకీర్ణ ప్రభుత్వం గత దశాబ్దంలో రూ.70,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు చేసింది. మరి ఈ పది సంవత్సరాల కాలంలో సాగునీటి వసతిని పొందిన భూముల విస్తీర్ణం కేవలం 1శాతం మాత్రమే పెరిగింది. నీటిపారుదల రంగంలో చోటుచేసుకున్న అవినీతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామనే హామీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఇంతవరకూ ఆ అవినీతికి ఏ ఒక్కరినీ జవాబుదారీని చేయలేకపోయింది.

కరవు పరిస్థితుల మూలంగా మహారాష్ట్ర ప్రజల్లో తీవ్ర నిరాశానిస్పృహలు నెలకొన్నాయి. బీడ్ పట్టణానికి సమీపంలోని పాయితాండా గ్రామం ఈ నైరాశ్య పరిస్థితులను పూర్తిగా ప్రతిబింబిస్తోంది. బంజారాల గ్రామమైన పాయితాండాలో గత ఏడాది ఇరవైమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 'తెల్ల బంగారం' ద్వారా అధిక ఆదాయం వస్తుందనే ఆశతో తమ భర్తలు బీటీ పత్తిని సాగుచేశారని వారి వితంతువులు చెప్పారు. వ్యవసాయ దినుసుల ధరలు బాగా పెరిగిపోవడంతో పెద్దమొత్తంలో బ్యాంకు రుణాలు తీసుకున్నారని చెప్పారు. అయితే వర్షాలు కురవకపోవడంతో ఆ రైతుల ఆశలు వమ్మయ్యాయి. లక్షలు పెట్టుబడి పెట్టినా పైసా ఆదాయం లేకపోవడంతో అప్పులు ఊబిలో కూరుకుపోవడం జరిగింది. దీంతో కుమార్తెల వివాహాలకు, కుమారుల చదువుకు వడ్డీ వ్యాపారస్తుల నుంచి మరిన్ని అప్పులు తీసుకోవడం జరిగింది. ఆ అప్పులు తీరే పరిస్థితి కనిపించకపోవడంతో ఆ బంజారా రైతులకు ఆత్మహత్యే గత్యంతర మయింది. ఇప్పుడు ఆ గ్రామంలోని చాలా కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలసపోయాయి. చాలామంది కాంట్రాక్టు కూలీలుగా బతుకులీడుస్తున్నారు. యూపీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా వారిని ఆదుకోలేకపోయింది. ఇక ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ జలయుక్త్ షివర్ యోజన ఇంకా ఆ గ్రామం దరిదాపుల్లోకి రాలేదు. సరే, ప్రధానమంత్రి పంటల బీమా పథకం గురించి విన్నవారు ఆ బంజారా గ్రామంలో ఒక్కరూ లేరు. మరి ఇటువంటి పరిస్థితుల్లో నీటిని ఆదా చేసే వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టకుండా పాయితాండాలాంటి గ్రామాల్లో సుస్థిరా ఆదాయాలను ఎలా సృష్టించగలుగుతారు?

ప్రధాని మోదీ పాయితాండాను సందర్శించి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల విషాదగాథలు వినాలి. ఒక్కసారి సందర్శించినంత మాత్రాన ఆ గ్రామానికి 'అచ్ఛేదిన్' రాకపోవచ్చు. అయితే అది ఢిల్లీ, ముంబయిలోని విధాన నిర్ణేతలకు, క్షేత్ర వాస్తవాలు తెలిసినవారికి మధ్య ఉన్న సమాచారలోపాన్ని తగ్గించటానికి విశేషంగా తోడ్పడు తుందనటంలో సందేహం లేదు.

**తాజా కలం:** పైఠాన్‌లోని ఒక పశువుల సంతలో మేము కొంతమంది రైతులను కలుసుకున్నాము. వారు పూర్తిగా నిరాశానిస్పృహలలో ఉన్నారు. ఏదో ఒక ధరకు మాంసం వ్యాపారులకు తమ పశువులను విక్రయించడానికి వారు సిద్ధంగా ఉన్నారు. మహారాష్ట్రలో ఆవులు, ఎద్దులు, దున్నపోతులు మొదలైన పశువుల వధపై పూర్తిగా నిషేధం ఉన్నది కదా. అయినా తమ పశువులను ఎంత తక్కువ ధరకు అయినా అమ్ముకోవడానికి ఆ రైతులు సిద్ధంగా ఉన్నారంటే వారు ఎటువంటి దుస్థితిలో ఉన్నారో అర్థమవుతుంది. భారత్ మాతా కీ జై వలే గోమాతను రక్షించాలి అనేది ఒక నినాదం మాత్రమే. కరవు పీడిత ప్రాంతాలలోని రైతులకు అది ఒక రొట్టెనూ ఇవ్వలేదు. ఒక గుక్కెడు నీళ్లనూ ఇవ్వలేదు. ❐

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)

# నీటి చుక్కే గగనమైనా పట్టదా?

- దేవిందర్ శర్మ



ఇది ఎన్నడో మరపున పడిపోయిన కథనం. అది 1965. ఆ ఏడాది దేశంలో కరవు నెలకొంది. ఆహార దిగుమతులపైనే చాలా ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. దేశంలో చాలాభాగం ఆహారకొరతను ఎదుర్కొంటున్న ఆ సమయంలో, నాటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి దేశ ప్రజలంతా ప్రతి సోమవారం ఉపవాసం పాటించాలని విజ్ఞప్తి చేశారు. నిజానికి నాడు దేశంలోని ప్రతి ఒక్కరూ ఆకలితో పడుకోవాల్సిన పరిస్థితి నెలకొనలేదు. సోమవారం ఉపవాసం పాటించాలన్న శాస్త్రి పిలుపు ప్రాథమికంగా ఆకలితో అల్లాడుతున్న లక్షలాదిమంది పట్ల సౌహార్ద్రతా ప్రకటన మాత్రమే. అలా ఆదా చేసిన ఆహారం, ఆకలితో ఉన్న చిన్న జనాభాలో ఒక చిన్న భాగం ఆకలిని తీర్చడానికయినా సరిపోయిందనుకోను. కాకపోతే ఆకలితో అల్లాడుతున్న ప్రజల పట్ల దేశం పట్టింపును ప్రదర్శిస్తోంది. వారితో పంచుకోవడం కోసం ఒకరోజు ఆహారాన్ని త్యాగం చేయడానికి అది సిద్ధంగా ఉన్నది అనే అంతర్నిహిత సందేశాన్ని ఆ పిలుపు స్పష్టంగానూ, గట్టిగానూ వినిపించింది.

**సహానుభూతికి కోర్టు ఆదేశాలు అవసరం**

యాభై ఏళ్ల తర్వాత, "విశాల ప్రజానీకం ప్రయోజనాల కోసం" 13 ఐపీఎల్ మ్యాచ్‌లను తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న మహారాష్ట్ర నుంచి బయటకు తరలించటం కోసం బొంబాయి హైకోర్టు ఆదేశం అవసరమయింది! క్రికెట్ పిచ్ కోసం ఖర్చయ్యే నీటిని ఆదా చేయటం వల్ల లాతూరు నగరం ఒక్కరోజు నీటి అవసరాన్ని కూడా తీర్చలేదని హైకోర్టుకు నిస్సంశయంగా తెలుసు. "ప్రభుత్వం ప్రజల దుస్థితిని పట్టించుకోకుండా ఉండటానికి వీల్లేదు" అనే సందేశాన్ని పంపాలనేదే కోర్టు ఆదేశాల ప్రాథమిక లక్ష్యం.

ఆ సందేశానికి స్పందించిన ముంబయి హోటళ్లు, రెస్టారెంట్ల అసోసియేషన్.. ఇక నుంచి కస్టమర్లు తాము వచ్చి కూర్చున్న వెంటనే గ్లాసుల నిండా నీరు ఉంచుతారని ఆశించవద్దని ప్రకటించింది. టేబుల్ మీద ఉంచిన జగ్గును తీసుకుని వారు తమంతట తాము కావలసినంత నీటిని గ్లాసులో పోసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల వారు వదిలివెళ్లే సగం గ్లాసు నీళ్లు వృధా కాకుండా ఉంటాయి. ఈ చర్య వల్ల దుర్భిక్ష మహారాష్ట్ర ఎదుర్కొంటున్న నీటికొరత సమస్య తీరేదేమీ కాదు. కాకపోతే, తోటి పౌరుల పట్ల పట్టింపును చూపే స్పందనాతత్వాన్ని అది ప్రతిఫలిస్తుంది.

దుర్భిక్ష పీడిత ప్రాంతాల ప్రజల దుస్థితి గురించి, వారు అనుభవిస్తున్న బాధల గురించి సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని మేలుకొలపడం అవసరమైంది. పాలనా యంత్రాంగం ఎంతగా పట్టింపుతనం లేకుండా బండబారిపోయిందో దీన్నిబట్టి అర్థమవుతుంది. ఇంచుమించు 70కోట్లమంది ప్రజలు వరసగా రెండో ఏడాది సంభవించిన ఈ దుర్భిక్ష పీడితులుగా ఉన్నారని అంచనా. దేశ ప్రధానభాగంలో నెలకొన్న ఈ తీవ్ర సంక్షోభం గురించిన స్పృహ అటు ప్రభుత్వానికి, ఇటు మీడియాకు కూడా లేకుండా పోయింది. 10 రాష్ట్రాల్లోని గణనీయమయిన భాగాలు వరసగా రెండో ఏడాది క్షామంతో అల్లాడుతున్నాయి. వేడి వాతావరణం కొనసాగటం వల్ల పంటలు ఎండిపోయాయి. రైతులు మొదట పశువులను వదులుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత వారే ఇళ్లూవాకిళ్లూ, ఊళ్లు వదిలి వలసపోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

**ఇళ్లూవాకిళ్లూ వదిలి వలసబాట**

మహారాష్ట్రలోని మరఠ్వాడా సహా పలుప్రాంతాలు వరసగా మూడో ఏడాది దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 2015 సెప్టెంబర్‌లోనే రాష్ట్రంలోని 43,000 గ్రామాల్లో 14,708 క్షామపీడిత గ్రామాలని ప్రకటించింది.

కర్ణాటకలోని 30 జిల్లాల్లో 27 జిల్లాల్లోని 127 తాలూకాలను క్షామపీడితమైనవని సెప్టెంబర్ 2015లో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, 196 మండలాలను క్షామపీడితమైనవిగా ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో క్షామపరిస్థితి మరింత దారుణంగా ఉంది. జార్ఖండ్‌లోని పాలమూ జిల్లా గత ఆరేళ్లలో ఐదేళ్లుగా క్షామాన్ని ఎదుర్కోవలసి వస్తోంది. బుందేల్‌ఖండ్‌దీ అదే కథ. క్షామానికి అల్లాడుతున్న ప్రజల మొహాల్లోనే ఆ దైన్యమంతా తాండవిస్తోంది.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు రెంటిలోనూ విస్తరించి ఉన్న బుందేల్‌ఖండ్ క్షామం గురించి కనీసం గత నాలుగేళ్లుగా వార్తా నివేదికలు వస్తూనే ఉన్నాయి. దుర్భిక్షం నెలకొన్నప్పుడు మొదట దాని బారిన పడేది పశువులు. మహిళలు వాటి నుదుట తిలకం దిద్ది, వాటి పాదాలకు నమస్కరించి స్వేచ్ఛగా వాటిని వదిలిపెట్టేయటం నేను చూసిన సాధారణ రివాజు. పశువులు పోయాక కూడా దుర్భిక్ష పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారటంతో తాగునీటి పరిమిత వనరులు సైతం ఎండిపోతాయి. ఆడా, మగా అంతా రోజులో అత్యధిక భాగం ఒక బకెట్టు నీళ్లు సంపాదించడం కోసం దూరాభారాలకు నడుస్తూనే ఉంటారు. పంటలు పూర్తిగా ఎండిపోయాక ఇక వలసపోవడం మాత్రమే రైతులకు మిగిలివుండే దారి.

## నగరవాసి ఊహకు తట్టని విపత్తు

మహారాష్ట్రలోని లాతూరులో ట్యాంకర్లతో నీటిని అందించే ప్రాంతాల్లో సెక్షన్ 144ను విధించినట్టు వస్తున్న వార్తలు.. తాగునీటి కరవు వల్ల ఎంతటి విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయో తెలుపుతుంది. బట్టలు ఉతుక్కోవటం, స్నానం చేయడం వంటి నిత్యకృత్యాలకు అవసరమయ్యే నీరు దాదాపుగా లభించని పరిస్థితుల్లో ప్రజలు చెప్పనలవిగాని కష్టాలకు గురికావాల్సి వస్తోంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు కుళాయి తిప్పితే చాలు నీరు లభించే లేదా రిఫ్రిజిరేటర్లలోని చల్లటి నీరు అందుబాటులో ఉండే నగర ప్రజలకు.. ఈ సంక్షోభం ఎంత తీవ్రమయినదో, రోజులు తరబడి నీరు అసలుకే లభించకుండా మనగలగడం ఎలాగో ఊహకైనా తట్టదు. ఇటీవల నేను బుందేల్‌ఖండ్ ప్రాంతంలో చేసిన పర్యటనల్లో ఒక రైతు కుటుంబాన్ని స్నానం చేయాలని అడిగాను. "మరో లడ్డూ తినండి. అంతేగానీ స్నానం మాట ఎత్తకండి!" అని ఆ ఇంటి ఆడమనిషి నాకు చెప్పేసింది.

గత కొన్ని నెలలుగా క్షామపీడిత రాష్ట్రాలు చాలావాటిలో పర్యటిస్తున్న నేను ఈ విషయంలో నెలకొన్న తీవ్ర అసమానతను చూసి నివ్వెరపోయాను. కర్ణాటకలోని 80శాతం ప్రాంతం దుర్భిక్షానికి గురై ఉండగా.. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో దాని దాఖలాలే లేవు. అలాగే ముంబయిలో పయనిస్తుంటే, గత రెండేళ్లుగా ఆ రాష్ట్రం తీవ్రమైన నీటిఎద్దడిని ఎదుర్కొంటున్న సూచనలు ఏమాత్రం కన్పించలేదు. నగరాలలో నివసిస్తున్న ప్రజలకు తమ పెరట్లోనే ఉన్న గ్రామాలలో నెలకొన్న దయనీయమైన పరిస్థితుల గురించి ఊహామాత్రంగానైనా తెలియదు. వార్తాపత్రికల్లో చదివే దుర్భిక్షం గురించిన వార్తాకథనాలను వారు ఏ ఇథియోపియా ప్రజల ఇక్కట్ల గాథలో అన్నట్టుగా వారు చూస్తారు.

## దేశం అండగా నిలవాలి

ఈ తీవ్ర కష్టకాలంలో దేశం, ఒక్క నీటి బొట్టు కోసం ఆక్రందిస్తున్న పెద్దసంఖ్యలోని ప్రజలకు సంఘీభావంగా నిలిచి తీరాలి. ముంబయి రెస్టారెంట్లలాగే, ఫైవ్‌స్టార్ హోటళ్లు సహా దేశంలోని హోటళ్లన్నీ నీటివినియోగాన్ని తగ్గించే తక్షణ చర్యలను చేపట్టాలి. కనీసం, అవి కస్టమర్లను టబ్బు స్నానాలకు బదులు షవర్ స్నానాలకు పరిమితం కావాలని కోరాలి. గోల్ఫ్ క్లబ్బులు సైతం వారానికి మూడురోజులు మూసేసుకోవచ్చు. వాటి నిర్వాహకులు గోల్ఫ్ కోర్సులన్నీ తమకు కావాల్సిన నీటి కోసం వాటర్ హార్వెస్టర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రకటించాలి. ఈ సంక్షోభ సమయంలో స్విమ్మింగ్ పూల్స్‌ని మూసివుంచాలి. కార్లను కడగటం, తోటలకు నీటిని పెట్టటంలో నియంత్రణను పాటించాలి.

పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు మొదలైనవి సాధ్యమైనంతగా నీటిని పొదుపుచేయడం కోసం పలు ఇతర చర్యలను కూడా చేపట్టటం అవసరం. దుర్భిక్షం ఒక ప్రకృతి విపత్తు. ఆ విపత్తుకు గురయినవారికి దేశం మద్దతుగా నిలవాలి. విచ్చలవిడి నీటి వినియోగాన్ని ఏదిఏమైనా అరికట్టాల్సిందే. లాల్‌బహదూర్ శాస్త్రి జీవించి ఉండి ఉంటే.. దేశం తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొంటుండగా దాని పట్ల పట్టింపును చూపలేని జాతిని చూసి, సాటివారి పట్ల సహానుభూతిని రేకెత్తించడానికి ఏమి చేసి ఉండేవారా? అని నాకు ఆశ్చర్యం వేస్తుంటుంది.

(సాక్షి సౌజన్యంతో) ❐

# డబ్బు, నేర రాజకీయాలపై చర్నాకోలా!

- ఏనుగుల రాకేష్ రెడ్డి
డైరెక్టర్, సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్

ప్రజాస్వామ్యానికి రాజకీయ వ్యవస్థ ఆయువుపట్టుగా మారుతోంది. సమంజసమైన రాజకీయాలతోనే సరైన ప్రజాస్వామ్యాన్ని సృష్టించడం సాధ్యమవుతుంది. దురదృష్టవశాత్తూ దేశంలో రాజకీయాలను కులం, మతం, భాష, ప్రాంతం శాసిస్తున్నాయి. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఊపిరిపోస్తాయి. ప్రజలు కలలుకన్న దేశ నిర్మాణానికి, సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తాయి. ఎన్నికల ప్రక్రియపై డబ్బు, నేరగాళ్ల తీవ్ర దుష్ప్రభావం కనబరుస్తున్నప్పటికీ– ఈ అంశంపై దేశంలో లోతైన చర్చ జరగకపోవడం దురదృష్టకరం. ఈ దుర్లక్షణాల ప్రభావం ఎన్నికలకే పరిమితం కాదు, పాలనపైనా ఉంటుందన్న సత్యం ప్రజలూ గ్రహించాల్సిన సమయం వచ్చింది. దేశంలో తాజాగా అయిదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనైనా– ఈ అంశాన్ని కూలంకషంగా చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించకపోతే పాలనావ్యవస్థలు గాడి తప్పుతూనే ఉంటాయి.

**పెచ్చరిల్లుతున్న పోకడలు**

దేశంలో 2004 నుంచి 2013 వరకు జరిగిన సార్వత్రిక, ఉప ఎన్నికల్లో అభ్యర్థులకు సంబంధించిన గణాంకాలు ఆందోళనకర పరిస్థితిని ఆవిష్కరిస్తున్నాయి. ఈమధ్యకాలంలో పోటీచేసిన 62,847 మందిలో 18శాతం, అంటే 11,030మందిపై 27,027 పెండింగ్ క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎనిమిదిశాతం అభ్యర్థులు అంటే 5,253 మందిపై హత్య, అత్యాచారం, అవినీతి, దోపిడి, దొంగతనం వంటి తీవ్ర నేరాలకు సంబంధించి 13,984 క్రిమినల్ కేసులున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన 8,230మంది అభ్యర్థుల్లో 8,163మంది సమాచారాన్ని పరిశీలించినప్పుడు, 17శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, 11శాతంపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు వివిధ రాజకీయ పార్టీల తరపున పోటీచేసిన 2,240మందిలో 1,309మంది సమర్పించిన ప్రమాణపత్రాలు (అఫిడవిట్లు) పరిశీలించినప్పుడు 21శాతంపై క్రిమినల్ కేసులు, 11శాతంపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్టు అర్థమవుతోంది. అదేసమయంలో తెలంగాణ శాసనసభకు పోటీచేసిన 1,669మందిలో 1,000మంది వెల్లడించిన సమాచారం ప్రకారం– 23శాతంపై క్రిమినల్ కేసులు, 14శాతంపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేలింది. మొత్తంగా 2003–2014 వరకు పోటీచేసిన ప్రతి ఐదుగురిలో ఒకరిపై క్రిమినల్ కేసుంది. ఇది కేవలం లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకే పరిమితం కాదు. స్థానిక సంస్థల్లోనూ ఇదే పంథా కొనసాగుతోంది. ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 150 డివిజన్లలో 72మంది క్రిమినల్ కేసులు ఉన్నవాళ్లు పోటీ చేయడం గమనార్హం.

2004 నుంచి 2013 వరకు జరిగిన ఎన్నికల్లో గెలిచిన

**2004 నుంచి 2013 వరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో అభ్యర్థుల వివరాలపై జరిపిన విశ్లేషణ**

| | |
|---|---|
| విజయం సాధించినవారిలో సచ్ఛీలురు | 12శాతం |
| నెగ్గినవారిలో కేసులు ఉన్నవారు | 23శాతం |
| గెలిచినవారిలో తీవ్రమైన కేసులు ఉన్నవారు | 23శాతం |
| అభ్యర్థుల సగటు ఆస్తులు | రూ. 1.37 కోట్లు |
| గెలిచినవారి సగటు ఆస్తులు | రూ. 3.81 కోట్లు |
| కేసులుండి గెలిచినవారి సగటు ఆస్తులు | రూ. 4.27కోట్లు |
| తీవ్ర కేసులుండి నెగ్గినవారి సగటు ఆస్తులు | రూ. 4.38 కోట్లు |
| అభ్యర్థుల ఆస్తుల వృద్ధి | 133శాతం |
| గెలిచినవారి ఆస్తుల వృద్ధి | 206శాతం |
| కేసులుండి నెగ్గినవారి ఆస్తుల వృద్ధి | 283శాతం |
| తీవ్రమైన కేసులుండి నెగ్గినవారి ఆస్తుల వృద్ధి | 275శాతం |

8,832మంది ప్రజాప్రతినిధుల్లో 28.4శాతం, అంటే 2,497మందిపై 9,993 పెండింగ్ క్రిమినల్ కేసులున్నాయి. 13.5శాతం (1,187మంది) ప్రజాప్రతినిధులపై 4,824 తీవ్రమైన కేసులున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన లోక్‌సభ సభ్యుల్లో 34శాతంపై క్రిమినల్ కేసులు, 24శాతంపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికైనవారిలో 49శాతం, తెలంగాణ శాసనసభకు ఎన్నికైనవారిలో 56శాతంపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. మొత్తంగా 2004 నుంచి 2014 వరకు గెలిచిన ప్రతి ఇద్దరిలో ఒకరిపై క్రిమినల్ కేసుంది. ఎన్నికల్లో పోటీచేసేవారిలో ప్రతి అయిదుగురిలో ఒకరిపై, గెలిచిన ప్రతి ఇద్దరిలో ఒకరిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. దీన్నిబట్టి కేసులు ఉన్నవారికి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు బోధపడుతుంది. లోక్‌సభ, శాసనసభల్లో సుమారుగా 30శాతంమంది ప్రజాప్రతినిధులపై కేసులున్నాయి. సచ్ఛీలురకన్నా క్రిమినల్ కేసులు ఉన్నవాళ్లే అత్యధికంగా గెలుస్తున్నారు. దాదాపు అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఇదే తంతు కొనసాగుతుండటం ఆందోళన కలిగించే పరిణామం. అంతేకాదు, అభ్యర్థుల్లో అందరికన్నా సంపన్నులు, క్రిమినల్ కేసులు ఉన్నవాళ్లు విజయాలు నమోదు చేస్తున్నట్లు గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. లోక్‌సభకు 2014లో జరిగిన ఎన్నికల్లో గెలిచినవారిలో 82శాతం కోటీశ్వరులు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 81శాతం, తెలంగాణ శాసనసభలో 70శాతం సభ్యులు కోట్లకు పడగలెత్తినవారే. గణాంకాలను సునిశితంగా పరిశీలించినప్పుడు మూడు అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకటి- గెలిచే అవకాశాలను డబ్బు పెంచుతోంది. రెండు- డబ్బుకు తోడుగా క్రిమినల్ కేసులు విజయావకాశాలను మరింత పెంచుతున్నాయి. మూడు- గెలిచినవారు విపరీతంగా ఆస్తులు కూడబెడుతున్నారు.

రోజురోజుకూ ఎన్నికల ఖర్చులు విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సగటున ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం అభ్యర్థులంతా కలిసి సుమారు రూ.25 కోట్ల వరకూ ఖర్చుపెడుతున్నారని 2012లో నాటి భారత ఎన్నికల కమిషనర్ అంచనా వేశారు. అంటే, దేశంలోని నాలుగువేల అసెంబ్లీ స్థానాల్లో సుమారుగా లక్షకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నమాట. ఇక 543 లోక్‌సభ స్థానాల్లో సుమారుగా రూ.15వేల కోట్లు వ్యయమవుతున్నట్లు




మన ప్రజాస్వామ్యం ఎంతో విలువయిందని చెప్పానుగా.

అంచనా. గ్రామపంచాయతీ, మునిసిపల్, మండల్ పరిషత్, జిల్లా పరిషత్, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో అవుతున్న ఖర్చులు, శాసనసభ ఎన్నికల వ్యయంకన్నా రెట్టింపు ఉన్నాయి. అంటే, సుమారుగా రెండు లక్షల కోట్లు రూపాయలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చుపెడుతున్నారు. అయిదు సంవత్సరాలలో జరిగే అన్ని ఎన్నికలనూ కలుపుకొని సుమారు మూడులక్షల కోట్ల రూపాయల నుంచి రూ.3.15లక్షల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇది దేశ వార్షిక బడ్జెట్‌లో 18శాతం. డజన్ల కొద్దీ పార్టీలు, స్వతంత్రులు బరిలో ఉండటం, పోలింగ్ శాతం తక్కువగా ఉండటంతో డబ్బు, తాయిలాలతో కొద్దిశాతం ఓట్లు కొని ఎన్నికల్లో గెలుపోటముల్ని నిర్ణయించగలుగుతున్నారు. రాజకీయాలు, ఎన్నికల్లో డబ్బు, నేరగాళ్ల ప్రభావం పెచ్చరిల్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో విపరీత పరిణామాలకు అంటుకడుతోంది. పేదల కోసం పనిచేయాలన్న సిద్ధాంతాలకు క్రమంగా కాలం చెల్లుతోంది. నిబద్ధంగా ప్రజాసేవ చేయాలనుకునే సామాన్యులకు రాజకీయాల్లో ప్రవేశమే లేకుండా పోయింది. నోట్లు గుమ్మరించి ఓట్లు కొనుక్కొని గెలిచిన నాయకులు, తాము పెట్టిన పెట్టుబడికి మరెన్నో రెట్లు

**రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం కిందకు ఆచరణాత్మకంగా ఏరకంగా తీసుకురావచ్చు అనే అంశం పరిశీలించాలి. రాజకీయ పార్టీలు రూ.20వేలకు పైబడి తీసుకునే విరాళాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించే '24-ఎ' పత్రంలో ఎలాంటి ఖాళీలు లేకుండా సమర్పించేలా ఎన్నికల సంఘం ఆదేశించాలి. విరాళాల వివరాలను పార్టీలు, ఎన్నికల కమిషన్ 'ఆన్‌లైన్'లో ప్రకటించాలి. నిర్ణీత వ్యవధిలో వివరాలు సమర్పించని రాజకీయ పార్టీలకు పన్ను మినహాయింపు రద్దు చేయాలి. అక్రమ నిధులు, నల్లధనం, గుత్తేదారులు, వ్యాపారస్తులపై ఆధారపడకుండా చూసేందుకు ప్రభుత్వమే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు భరిస్తే మంచిదన్న అభిప్రాయం ఎప్పటినుంచో వినిపిస్తోంది.**

సంపాదించాలన్న యావతో ప్రజాసేవను విస్మరిస్తున్నారు. అందుకే పాలన ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. భూములు, గనులు, ఇసుక వంటి దందాలు పెరుగుతున్నాయి. కాబట్టి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు దీన్ని తీవ్ర సమస్యగా గుర్తించాలి. డబ్బు తీసుకున్నా, ఓటరు తాను అనుకున్న అభ్యర్థికే ఓటు వేస్తాడన్నది వితండవాదం. ఎన్నికల్లో ప్రలోభాల ప్రభావాన్ని ఏమాత్రం తక్కువవ అంచనా వేయడానికి వీల్లేదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**పారదర్శకతే మందు**

మరింత ప్రజాస్వామ్యాన్ని ఇవ్వడం ద్వారానే అందులోని రుగ్మతలను తొలగించడం సాధ్యమవుతుంది. రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో ప్రజాస్వామ్య, పారదర్శక సంస్కృతి పెరగాలి. అప్పుడే అసలైన ప్రజాసేవకులకు ఎన్నికల్లో అవకాశాలు పెరుగుతాయి. రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం కిందకు ఆచరణాత్మకంగా ఏరకంగా తీసుకురావచ్చు అనే అంశం పరిశీలించాలి. రాజకీయ పార్టీలు రూ. 20వేలకు పైబడి తీసుకునే విరాళాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించే '24–ఎ' పత్రంలో ఎలాంటి ఖాళీలు లేకుండా సమర్పించేలా ఎన్నికల సంఘం ఆదేశించాలి. విరాళాల వివరాలను పార్టీలు, ఎన్నికల కమిషన్ 'ఆన్‌లైన్'లో ప్రకటించాలి. నిర్ణీత వ్యవధిలో వివరాలు సమర్పించని రాజకీయ పార్టీలకు పన్ను మినహాయింపు రద్దు చేయాలి. అక్రమ నిధులు, నల్లధనం, గుత్తేదారులు, వ్యాపారస్తులపై ఆధారపడకుండా చూసేందుకు ప్రభుత్వమే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు భరిస్తే మంచిదన్న అభిప్రాయం ఎప్పటినుంచో వినిపిస్తోంది. ప్రజలే స్వయంగా అభ్యర్థులకు విరివిగా విరాళాలు అందించాలి. ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల కేసులకు సత్వర పరిష్కారం చూపేలా కోర్టులు న్యాయప్రక్రియను వేగవంతం చేయాలి. రౌడీషీటర్లను ఎన్నికల నుంచి బహిష్కరించాలి. అభ్యర్థులు సమర్పించిన ఆస్తులు, కేసుల వివరాలను ఓటరు గమనించే విధంగా పెద్ద అక్షరాలతో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలి. డబ్బు, మద్యం, నేరాగాళ్ల వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యపరచేలా ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనే పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలి. ఎన్నికల సమయంలో మరింత స్వతంత్రంగా వ్యవహరించేందుకు ఎలక్షన్ కమిషన్ ప్రభుత్వ యంత్రాంగం మీద ఆధారపడకుండా సొంత సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు కల్పించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో తమ అర్హత, విచక్షణ మేరకే పాలన అందుతుందన్న వాస్తవాన్ని ప్రజలూ గ్రహించాలి. తాత్కాలిక తాయిలాలకు లొంగకుండా సచ్ఛీలురను ఎన్నుకొనేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈరకంగా సుపరిపాలనకు బాటలు వేయాలి! మరోవంక ప్రభుత్వాలూ నిబద్ధంగా వ్యవహరించాలి. న్యాయ కమిషన్ సిఫార్సు చేసిన సంస్కరణలను అమలుచేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. సంకుచిత రాజకీయాలకు చోటివ్వకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఎన్నికల సంస్కరణలక వీలు కల్పిస్తూ ప్రభుత్వంతో రాజకీయ పార్టీలు ముందుకు నడవాలి.

**అటకెక్కిన సిఫార్సులు...**

ఎన్నికల సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన గోస్వామి కమిటీ (1990), వోరా కమిటీ (1993), ఇంద్రజిత్ గుప్తా కమిటీ (1998), 1999 నాటి న్యాయ కమిషన్, రాజ్యాంగం పనితీరును అధ్యయనం చేసిన 2001 నాటి జాతీయ కమిషన్, 2004నాటి ఎన్నికల కమిషన్, 2008 నాటి రెండో పరిపాలన కమిషన్ వంటి అనేక కమిటీలు, కమిషన్‌లు నేర రాజకీయాలను కట్టడి చేయడానికి అనేక మార్గాలు చూపాయి. వాటిని అమలు చేయడానికి ప్రభుత్వాలు మాత్రం ముందుకు రాలేదు. 2015 మార్చిలో న్యాయ కమిషన్ ఇచ్చిన 255వ నివేదికలోనూ డబ్బు, నేరగాళ్ల ప్రభావాన్ని అరికట్టే అనేక మార్గాలు చూపారు. ఆ సూచనలు, సిఫార్సులు అమలు చేయాల్సిన సమయమిది!

(ఈనాడు సౌజన్యంతో) ❒

# 2015లో తగ్గిన ఉద్యోగాలు

కీలక ఆర్థికరంగాల్లో 2015లో కొత్తగా ఏర్పడిన ఉద్యోగాలు కేవలం 1.35లక్షలు. ఇది గత ఏడేళ్లలోనే అతితక్కువ. ఆభరణాలు, వాహనాలు, చేనేత, తోలుపరిశ్రమ తదితర రంగాల్లో ఉద్యోగావకాశాలవరంగా గణనీయమైన తగ్గుదల ఏర్పడింది. ఆభరణాల రంగంలో 19వేల ఉద్యోగాలు, చేనేత/పవర్ లూం రంగంలో 11వేలు, వాహనరంగంలో 8వేలు, రవాణారంగంలో 4వేల ఉద్యోగాలకు కోతపడింది. ఉద్యోగ కల్పన విషయానికొస్తే, ఐటీ/బీపీవో, దుస్తులు, వస్త్ర పరిశ్రమ, లోహ పరిశ్రమ ముందంజలో ఉన్నాయి. కేంద్ర కార్మికశాఖ విభాగమైన లేబర్ బ్యూరో జరిపిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.



| సంవత్సరం | ఉద్యోగావకాశాలు (లక్షల్లో) |
|---|---|
| 2014 | 4.21 |
| 2013 | 4.19 |
| 2012 | 3.21 |
| 2011 | 9.29 |
| 2010 | 8.7 |
| 2009 | 12.8 |

2009 నుంచి లేబర్ బ్యూరో త్రైమాసిక సర్వేలను వస్త్ర, తోలు, లోహ పరిశ్రమలు, వాహనాలు, ఆభరణాలు, రవాణా, ఐటీ/బీపీవో, చేనేత/పవర్ లూం రంగాల్లో నిర్వహిస్తోంది. ❐

# బొగ్గు దిగుమతి విలువను పెంచి చూపిన కంపెనీలు

తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలు, పలు విద్యుదుత్పత్తి సంస్థలు, వ్యాపారులకు ప్రమేయమున్న బొగ్గు కుంభకోణాన్ని రెవిన్యూ నిఘా విభాగ డైరెక్టరేట్ (డీఆర్ఐ) వెలికితీసింది. దిగుమతి చేసుకున్న బొగ్గు అసలు విలువను బాగా పెంచి చూపడం ద్వారా విదేశాలకు అక్రమ నగదును తరలించటంతోపాటు విద్యుత్తుకు ఎక్కువ రుసుములు వసూలుచేస్తూ వచ్చినట్టు నిగ్గుతేల్చింది. ఇండొనేషియా నుంచి బొగ్గును దిగుమతి చేసుకున్నవారు కృత్రిమంగా దాని విలువను 50 నుంచి 100శాతం పెంచారని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి. అక్కడి నుంచి నేరుగా మనదేశానికి సరకు దిగుమతి చేసుకున్నా, విలువ పెంచి చూపడం కోసం మార్గమధ్యంలో సింగపూర్, దుబాయ్, హాంకాంగ్, బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్ తదితర ప్రాంతాల నుంచి సరకు తెచ్చినట్టు ఇన్వాయిస్‌లు చూపించేవారని ఆ వర్గాలు వెల్లడించాయి. వీటిని సమకూర్చే ఏజెంట్లు కూడా భారతీయ దిగుమతిదారులకు చెందినవారే. ఈ మార్గాన విదేశాలకు ఎక్కువడబ్బు తరలించిన విద్యుదుత్పత్తి సంస్థలు 40 వరకూ ఉంటాయని అంచనా. వీటిలో గుజరాత్‌కు చెందిన ఒక ప్రముఖ సంస్థ, ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న రెండు సంస్థలతోపాటు రెండు ప్రభుత్వరంగ సంస్థలూ ఉన్నాయి. అన్ని ఇన్వాయిస్‌లనూ తనిఖీ చేయవలసిందిగా కస్టమ్స్ శాఖను డీఆర్ఐ కోరింది. ❐

# రాష్ట్ర సంక్షోభంలో కేంద్రం జోక్యాన్ని తప్పుపట్టిన హైకోర్టు

ఉత్తరాఖండ్ సంక్షోభానికి తాత్కాలికంగా ఏరకమైన పరిష్కారం వచ్చినా, ఆ కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు, చేసిన వ్యాఖ్యలు ఫెడరల్ వ్యవస్థ పటిష్టత, వ్యవస్థల నిర్మాణంపై కేంద్రప్రభుత్వానికి, సాంప్రదాయ రాజకీయపార్టీలకు కళ్లు తెరిపించేదిగా ఉంది.

ఉత్తరాఖండ్‌లో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకున్న తీరుపై తీవ్రంగా విరుచుకుపడిన ఆ రాష్ట్ర హైకోర్టు రాష్ట్రపతి పాలనను రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించింది. మార్చి 27న విధించిన రాష్ట్రపతి పాలనకు అనుకూలంగా కేంద్రం చెప్పిన వాదనల్ని ఆమోదిస్తే దేశంలోని సమాఖ్య వ్యవస్థకే విఘాతం కలుగుతుందని పేర్కొంది. భారతదేశం.. రాష్ట్రాల సమాఖ్య అని స్పష్టంచేసింది. కేంద్రం, రాష్ట్రాలు తమతమ పరిధుల్లో సార్వభౌమాధికారాన్ని కలిగివుంటాయని, 356వ అధికరణాన్ని చిట్టచివరి ప్రయత్నంగా, సంబంధిత ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం నడవనప్పుడు మాత్రమే వినియోగించాలని వివరించింది. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్న కేంద్ర మంత్రివర్గం సిఫార్సు పత్రాన్ని రహస్యంగా ఉంచాల్సిన అవసరమేమీ లేదని, ప్రజాస్వామ్యంలో అన్ని పత్రాలనూ బహిరంగపరచాల్సిందేనని వ్యాఖ్యానించింది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ప్రభుత్వానికున్న అధికారాల్ని తొలగించి రాష్ట్రపతి పాలన విధించటం ద్వారా.. ఉత్తరాఖండ్‌లో కేంద్రం అస్తవ్యస్త పరిస్థితుల్ని నెలకొల్పిందని విమర్శించింది. ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చినప్పటికీ, శాసనసభలో మెజారిటీని నిరూపించుకునే అవకాశాన్ని ప్రభుత్వానికి కల్పించవలసిందేనని స్పష్టంచేసింది. శాసనసభలో మెజారిటీ నిరూపణకు రాజ్యాంగబద్ధంగా ఉన్న ఏకైకమార్గం బలపరీక్ష మాత్రమేనని పేర్కొంది. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధింపునకు కేంద్రప్రభుత్వం పేర్కొన్న కారణాలను ఆమోదించలేమని ధర్మాసనం పేర్కొంది. వాటిని అంగీకరిస్తే.. దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ రాష్ట్రపతి పాలన విధించవచ్చన్నదానిపై కేంద్రం భూతద్దం తీసుకుని వెతికే పరిస్థితి తలెత్తవచ్చని హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌లో, కేంద్రంలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ఉత్తరాఖండ్ అసెంబ్లీలో మార్చి 28న బలపరీక్ష జరిగేంతవరకూ రాష్ట్రపతి వేచి చూడాల్సిందని అభిప్రాయపడింది. గవర్నర్ సిఫార్సు చేయనప్పటికీ, (రాష్ట్రపతి పాలనకు సంబంధించిన) ఆర్టికల్ 356ని కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో విధించిందని తెలిపారు. బలపరీక్ష జరపాలంటూ గవర్నర్ మార్చి 23న పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు తొమ్మిదిమందిని కొనుగోలు చేయటానికి ప్రయత్నాలు జరిగినట్టుగా మీడియాలో వెల్లడైన అంశాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. "ఆ ఎమ్మెల్యేలను స్పీకర్ అనర్హులుగా ప్రకటించేవారేమో! ఆ విషయం కేంద్రానికి తెలియదు కదా! ఒకవేళ కేంద్రానికి దీనిపై ఏమైనా తెలిసినా.. ఎమ్మెల్యేల అనర్హతపై కేంద్రం జోక్యం అనవసరం. అయినప్పటికీ కేంద్రం జోక్యం చేసుకుంటే, అది పక్షపాతపూరితంగా వ్యవహరించిందని, రాష్ట్రంలో రాజకీయాలకు పాల్పడిందని భావించాల్సి ఉంటుంది" అని పేర్కొంది. ఆగమేఘాల మీద రాష్ట్రపతి పాలన విధించటానికి కారణాలేమిటని ప్రశ్నించింది.  ఎండ, వాన,చలికి తట్టుకుని ఓటు వేయటానికి వచ్చిన సామాన్యుడి భరోసాను కేంద్రం నిర్లక్ష్యం చేయదలచుకుందా? అత్యున్నత అధికార వ్యవస్థ అయిన భారత ప్రభుత్వం ఈవిధంగా వ్యవహరించటం బాగా లేదు, అని కోర్టు మందలించింది.

మార్చి 18న ద్రవ్యవినిమయ బిల్లు ఆమోదంపై ఉత్తరాఖండ్ అసెంబ్లీలో వివాదం నెలకొంది. బిల్లు ఆమోదం పొందలేదు కాబట్టి ప్రభుత్వం పడిపోయినట్టుగా భావించాలని బీజేపీ ఎమ్మెల్యేలతోపాటు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసు హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. మార్చి 28న అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకోవాలని హైకోర్టు ఆదేశించగా, ఈలోగా కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. దీనిని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి హరీష్ రావత్ హైకోర్టు విస్తృత ధర్మాసనాన్ని ఆశ్రయించటంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ వీకే బిస్త్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

**రాష్ట్రాల్లో పాలనపై పునరాలోచన జరగాలి: జేపీ**

ఉత్తరాఖండ్ హైకోర్టు ఆదేశాల్ని అన్ని పార్టీలకూ కనువిప్పు కావాలని, 356వ అధికరణ ప్రయోగాన్ని పూర్తిగా రద్దుచేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాష్ట్రాల్లో పాలనపై పునరాలోచన చేయాలని, ప్రభుత్వాలను ప్రత్యక్షంగా ఎన్నుకుంటే సుస్థిరత, సుపరిపాలన, ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు సాధ్యమవుతాయని, ఆర్టికల్ 356 అవసరం లేకుండా ఫెడరలిజం బలపడుతుందని జేపీ అన్నారు. ❐

# నాణ్యమైన విద్య, ఆరోగ్యం ప్రతిబిడ్డకూ అందించటమే నిజమైన అంబేద్కరిజం: జేపీ

సాహసం, స్వావలంబన, మేధస్సు, నిజాయతీ, జాతి నిర్మాణాలకు గొప్ప ఉదాహరణ డా॥ బీఆర్ అంబేద్కర్ అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బాబాసాహెబ్ 125వ జన్మదినోత్సవ సందర్భంగా ఆయనకు జేపీ ఘనంగా నివాళులర్పిస్తూ, వ్యవస్థల నిర్మాణానికి అంబేద్కర్ ఎంతో ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. పుట్టుకను బట్టి బతుకు నిర్ణయమైపోకుండా ప్రతి బిడ్డా తనలోని సామర్థ్యాన్ని వెలికితీసుకునే నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించటంలో రాజ్యవ్యవస్థ పాత్ర ఎలా ఉండాలో, సక్రమ ప్రోత్సాహకాల దిశగా విధానాలను మార్చటం ఎంత కీలకమో అంబేద్కర్ లోతుగా అర్థం చేసుకున్నారని జేపీ అన్నారు. నాణ్యమైన విద్య మలిచిన మహావ్యక్తి అంబేద్కర్ అని, చదువుతో ఆయన తనలోని సామర్థ్యాన్ని వెలికితీసుకోగలిగితే మన పాలకులు, సమాజ ధోరణులు విద్యావ్యవస్థను నాశనం చేస్తూ కోట్లాదిమంది బిడ్డలకు ఆ అవకాశం లేకుండా చేశాయని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. వివక్షను, పేదరికాన్ని అంతం చేయటానికి మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం తప్ప వేరే మార్గాలు లేవని, అంబేద్కర్‌ని గౌరవించుకోవటమంటే, నిజమైన అంబేద్కరిజమంటే ఈదేశంలో విద్య, ఆరోగ్యాలను ప్రతి బిడ్డకూ అందేలా వ్యవస్థీకృతంగా పెంపొందించటమేనని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❒

# విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు కేటాయింపులు పెంచాలి, సకాలంలో అందించాలి: ఆర్‌బీఐ

వివిధ రంగాలలో యువతీయువకుల సంఖ్య బాగా పెరుగుతున్నందున రాష్ట్రాలు తమ బడ్జెట్‌లలో విద్య, ఆరోగ్యం రంగాలకు కేటాయింపుల్ని పెంచాలని రిజర్వుబ్యాంకు అభిప్రాయపడింది. బడ్జెట్‌లోని మొత్తం కేటాయింపుల్లో ఈ రెండు రంగాలకు పొందుపరిచిన నిధులశాతం మిగతారాష్ట్రాల కంటే తెలంగాణలో తక్కువగా ఉన్నట్టు ఆర్‌బీఐ విశ్లేషించింది. స్థానిక ప్రభుత్వాలకు పన్నుల్లో వాటాలను, ఇతర నిధులను పంచి ఇచ్చేందుకు ఆర్థిక సంఘాలను రాష్ట్రాలు ఐదేళ్లకోసారి ఏర్పాటుచేసి వాటి సిఫార్సులను సకాలంలో అమలుచేయాలని సూచించింది.

## సంస్కరణల్ని ఆచరిస్తేనే భారత్‌కు సుస్థిరాభివృద్ధి

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థని, చైనాను దాటేస్తుందని చేస్తున్న ప్రచారంలో అత్యుత్సాహం ఎక్కువ, వాస్తవం తక్కువ అని ఆర్‌బీఐ గవర్నర్ డా॥ రఘురాం రాజన్ అన్నారు. భారత్ ఇప్పటికీ ప్రపంచంలోని నిరుపేద దేశాలలో ఒకటని, అభివృద్ధి చెందిన వ్యవస్థగా నిలదొక్కుకోవాలంటే ఇంకా చాలాదూరం ప్రయాణించాల్సి ఉందని అన్నారు. సగటు భారతీయునికన్నా సగటు చైనీయుడు నాలుగురెట్లు ఎక్కువ సంపన్నుడన్నారు. బ్రిక్స్ దేశాలన్నిటిలోనూ తలసరి ఆదాయం మనదేశంలోనే తక్కువన్నారు. సంస్కరణలతో కూడిన విధానాలను రాజీలేకుండా ఓ ఇరవయ్యేళ్లపాటైనా అమలుచేస్తే భారత్ చెప్పుకోదగిన స్థాయికి చేరుకుంటుందన్నారు.

## రాజన్ వ్యాఖ్యలు వాస్తవం: జేపీ

ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు పూర్తి వాస్తవమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల్లో మనం ప్రపంచంలోనే అధ్వాన్నంగా ఉన్నామని తొలినుంచీ లోక్‌సత్తా చెబుతోందని, తాత్కాలిక ఆకర్షణలు, పథకాలు, విద్వేష రాజకీయాల నుంచి బైటపడి ఈ రంగాలను బాగుచేసుకుంటేనే భారత్‌కు ఆశించిన భవిష్యత్తు దొరుకుతుందన్నారు. ఈ రంగాలలో సంస్కరణలను సాధించటం కోసం లోక్‌సత్తా తన వంతు అలుపెరగని కృషిని కొనసాగిస్తుందని, వీటిని వేగంగా సాధించటం ఇప్పుడు ఈదేశం ముందున్న సవాలని అన్నారు. ❒





హైదరాబాద్‌లోని గ్లోబల్ ఎడ్జ్ స్కూల్ 2016-17 విద్యాసంవత్సరం మొట్టమొదటి అసెంబ్లీనుద్దేశించి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల ప్రసంగించారు. విద్యార్థులలో విలువలు, క్రమశిక్షణ, వినమ్రత వంటి లక్షణాలకు స్ఫూర్తినిచ్చేందుకు విశిష్టవ్యక్తులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించటం ఆ పాఠశాలకి ఆనవాయితీ.



Posting Date 07-05-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May 1st, 2016




"నేటి విద్యార్థులు, యువత ఎలా ఆలోచించాలి? దేశభక్తి అంటే ఏమిటి? రాజకీయం భ్రష్టు పట్టిందా? సొంత సుఖాన్ని - సమాజ హితాన్ని అనుసంధానిస్తూ ఉత్తమ విలువలతో వ్యక్తిత్వ వికాసం ఎలా? తదితర అంశాలపై "యువవారధి' బృందం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆలోచనల్ని ప్రజ్వలింప చేసే వినూత్న సంభాషణ కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad